## యాభై టిఎంసిల కన్నీళ్లు

# ఎవరి కోసం మల్లన్న సాగర్?

## నిజానిజాలపై తెలంగాణ ప్రజలకు నివేదిక

'వీక్షణం' రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
సంపాదకవర్గ సభ్యుల అధ్యయనం

తెలంగాణ ఆత్మగౌరవ వేదిక
హైదరాబాద్
జూలై 2016

**50 TMC la Kanneellu**

**Evari kosam Mallanna Sagar?**

A Fact Finding Report to Telangana People

Cover Design : *Ankush Graphics*

Rs. 20

Published by : Telangana Atmagourava Vedika,
Hyderabad, Telangana State

For copies : 2-1-1/5, Nallakunta, Hyderabad - 500 044.
First Published : July 2016

యాభై టిఎంసిల కన్నీళ్లు
ఎవరి కోసం మల్లన్న సాగర్?
నిజానిజాలపై తెలంగాణ ప్రజలకు నివేదిక

కవర్ డిజైన్ : అంకుష్ గ్రాఫిక్స్

రు. 20

ప్రచురణ: తెలంగాణ ఆత్మగౌరవ వేదిక, హైదరాబాద్

ప్రతులకు : 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

ప్రచురణ సంఖ్య : 5

మొదటి ముద్రణ : జూలై 2016


ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్.
ఫోన్ : 040-27678411

# ప్రచురణకర్త మాట

జస్టిస్ కమిటీ శ్రీకృష్ణ కమిటీ ముందు కొందరు కోస్తా, రాయలసీమ ఎంఎల్ఏలు 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోరడమే దేశద్రోహం' అని పిటిషన్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఎత్తిపట్టడానికి, తెలంగాణ ఆత్మగౌరవం మీద దాడులను ఎదుర్కోవడానికి 2010 ఆగస్ట్ 11న తెలంగాణ ఆత్మగౌరవ వేదిక ఏర్పాటైంది. ఉద్యమ కాలమంతా అన్ని ప్రజాందోళన కార్యక్రమాలలో, సహాయ నిరాకరణలో, సకల జనుల సమ్మెలో, సాగర హారంలో, మిలియన్ మార్చ్‌లో క్రియాశీలంగా పాల్గొన్న తెలంగాణ ఆత్మగౌరవ వేదిక ఆ నాలుగు సంవత్సరాలలో మేధో కృషి కూడా సాగించింది. 'జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదిక: పొరపాట్లు, అబద్ధాలు, వక్రీకరణలు – ప్రతి అక్షరం ప్రజాద్రోహం' (2011 ఏప్రిల్), 'తెలంగాణలో ఒక కాళరాత్రి' (2013 జనవరి), 'విద్వేషమే ధ్యేయంగా విశాలాంధ్ర మహారభస – పచ్చి అబద్ధాల పరకాలకు అసలు నిజాల జవాబు' (2013 జూన్), 'తెలంగాణ కాలజ్ఞాని ప్రొఫెసర్ జయశంకర్' (2014 జూన్) పుస్తకాలు ప్రచురించింది.

తెలంగాణ ఏర్పడిన తరువాత కూడ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ఉపాధికి, భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడుతున్నప్పుడు నిజానిజాలు ప్రచారం చేసే బాధ్యత తీసుకోవాలనే ఉద్దేశ్యంతో మల్లన్న సాగర్ ముంపు బాధితుల ఆందోళన గురించి పుస్తకం ప్రచురించ దలచుకున్నాం. వీక్షణం సంపాదకవర్గం ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి నివేదిక తయారు చేస్తున్నదని తెలిసి వారి సహకారంతో ఈ పుస్తకం ప్రచురిస్తున్నాం. వీక్షణంకు కృతజ్ఞతలు.

– తెలంగాణ ఆత్మగౌరవ వేదిక



వేములఘట్టు ....................గ్రామ పంచాయతీ కార్యాలయము, మం॥ తొగుట ................. జి॥ మెదక్

# తీర్మానములు

తేది: 01-05-2016

| క్రమ సంఖ్య | సభ్యుల పేర్లు | హాజరు/ గైర్హాజరు | విషయ సంగ్రహం | చర్చలు - తీర్మానములు |
| --- | --- | --- | --- | --- |
| 1. | కలకుంట్ల మంజుల రమేష్ | హాజరు | వేములఘట్టు గ్రామాన్ని | తేది 01-05-16 రోజున ఉదయం 11-00 గంటలకు శ్రీమతి కలకుంట్ల మంజుల సర్పంచ్ గారి అధ్యక్షతన గ్రామ పంచాయితీ కార్యాలయములో సమావేశమై ఈ దిగువ చూపిన అంశములపై ఆమోదించి చర్చించి ఏకగ్రీవముగా తీర్మానించనైనది. |
| 2. | సుతారి కరుణాకర్ | " | కొమురవెల్లి మల్లన్న సాగర్ | 1) మా గ్రామములో కొమురవెల్లి మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ [illegible] |
| 3. | జోగి రేఖ | " | ప్రాజెక్ట్ నుంచి మినహాయిం | [illegible] |
| 4 | సాదని నాగవ్వ | " | చే విషయం గురించి, | [illegible] |
| 5 | చేరుపల్లి అశోక్ రెడ్డి | | | [illegible] |
| 6. | బండ్ల వెంకటేశం | " | | [illegible] |
| 7. | గాండ్ల మమత | " | | [illegible] |
| 8, | బత్తుల రామయ్య | | | [illegible] |
| 9. | తలమైన వెంకటలక్ష్మి | " | | [illegible] |
| 10, | బెప్పారం నరసవ్వ | | | [illegible] |
| 11. | బెప్పారం బాలమణి | , | | K. మంజుల సర్పంచ్ |

Udayasree, Wgl. Ph.: 2427067

మల్లన్న సాగర్ ప్రాజెక్టు వద్దని అన్నీ గ్రామ పంచాయితీలు తీర్మానం చేశాయి. పైన వేములగట్టు గ్రామ పంచాయితీ తీర్మానం.

యాభై టిఎంసిల కన్నీళ్లు

# ఎవరి కోసం మల్లన్న సాగర్?

నిజానిజాలపై తెలంగాణ ప్రజలకు నివేదిక

**ఉపోద్ఘాతం**

మెదక్ జిల్లా తొగుట, కొండపాక మండలాలలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న శ్రీ కొమరవెల్లి మల్లన్న సాగర్ నిర్మాణానికి, ప్రత్యేకంగా తమను నిర్వాసితులను చేయనున్న ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా అక్కడి పద్నాలుగు గ్రామాల ప్రజలు కొంతకాలంగా ఆందోళనలు సాగిస్తున్నారు. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు, గవర్నర్ కు విజ్ఞప్తులు చేసుకున్నారు. ప్రచారసాధనాల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఆయా గ్రామాల లోను, జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లోను నిరాహారదీక్షలు చేస్తున్నారు. మల్లన్న సాగర్ ప్రతిపాదనకు, ఆ ఆందోళనకు అనుకూల ప్రతికూల వార్తలు, అభిప్రాయాలు, వ్యాసాలు పత్రికలలో విరివిగా వెలువడుతున్నాయి. సోషల్ మీడియాలో ఒకవైపు ఎన్నోచోట్ల బాధితుల పక్షాన సమాచార క్రోడీకరణ, ప్రజల ఆక్రోశం వ్యక్తీకరణ జరుగుతుండగా, మరొకవైపు ప్రభుత్వ సమర్థకులు మల్లన్న సాగర్ కు అనుకూల వాదనలు చేస్తున్నారు.

ఇవన్నీ చూసి, సమస్య నిజానిజాలు, సమస్యలో ఇమిడి ఉన్న రాజకీయార్థిక, సాంకేతిక అంశాలు, ప్రజాందోళన వివరాలు తెలుసుకుని ప్రజలకు వివరంగా నివేదించవలసి ఉందని, సమస్యను విశ్లేషించవలసి ఉందని అనిపించింది. ఆ లక్ష్యంతో ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు ఎన్ వేణుగోపాల్, కె బాల్‌రెడ్డి, బి రామకృష్ణ, వై రామచంద్రం జూన్ 11న బాధిత గ్రామాల్లో పర్యటించారు.

ఏటిగడ్డ కిష్టాపూర్, వేములగట్టు గ్రామ ప్రజలను, వేములగట్టులో సమావేశమైన ప్రభావిత గ్రామాలన్నిటి ప్రజా ఉద్యమ నాయకులను కలిశారు. దాదాపు వంద మంది రైతులతో, స్త్రీలతో, యువకులతో, ఉద్యమకారులతో మాట్లాడారు. మల్లన్న సాగర్ గురించి ప్రభుత్వ నేతల ప్రకటనలను, బహిరంగంగా ప్రభుత్వ పత్రాలలో, ప్రభుత్వ వెబ్ సైట్లలో, పత్రికలలో, సోషల్ మీడియాలో వెలువడిన, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పథకాల పేరిట జరిగిన విధ్వంస చరిత్రను, ప్రజలను నిర్వాసితులను చేసి, బిచ్చగాళ్లుగా మార్చిన చరిత్రను పరిశీలించారు. ప్రజాప్రయోజనం కోసం అనే పేరు మీద ప్రజలను వాళ్ల భూములనుంచి వెళ్లగొట్టి, ఆ భూములను సేకరించడానికి ప్రభుత్వానికి హక్కు ఇచ్చే 1894 భూసేకరణ చట్టాన్ని, 2013లో పార్లమెంటు ఆమోదించిన భూసేకరణ, పునరావాసం, పునఃస్థిరీకరణలలో పారదర్శకత, న్యాయబద్ధ నష్టపరిహార హక్కు చట్టాన్ని, ఆ చట్టానికి 2015 లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలను, ఆ చట్టం స్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గవర్నమెంట్ ఆర్డర్ (జీవో) 123, 190, 214లను పరిశీలించారు.

ఈ నేపథ్యంలో మల్లన్న సాగర్ గురించి, మల్లన్న సాగర్ నిర్మాణానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాందోళన గురించి, ప్రభుత్వ పాత్ర గురించి, ప్రతిపక్షాల పాత్ర గురించి నిజానిజాలతో, వార్తల వెనుక దాగిన వాస్తవాలతో ఒక వివరమైన ప్రజా నివేదికను తెలంగాణ ప్రజానీకం ముందర సమర్పించాలనే ఆలోచన ఫలితమే ఈ నివేదిక.

## *అధికారిక ప్రకటనలో గందరగోళం*

ఆశ్చర్యకరమైన విషయమేమంటే ప్రభుత్వ అధికారిక పత్రాలలో, నీటి పారుదల శాఖ వెబ్ సైట్ మీద జూన్ 28 వరకూ, అంటే మల్లన్న సాగర్ వివాదం, ఆందోళన మొదలైన ఏడు నెలల వరకూ కూడ, మల్లన్న సాగర్ గురించి ప్రత్యక్ష ప్రస్తావన లేదు. అది ప్రభుత్వం చెపుతున్నంతగా ప్రజోపయోగకరమైన పథకమే అయితే దాని సమాచారాన్ని ఇలా దాచి ఉంచనవసరం లేదు. ఆ సమాచారాన్ని ప్రజలతో విస్తృతంగా పంచుకోవాలి. ప్రభావిత గ్రామాల ప్రజలకు సమాచారమంతా అందించి వారు మునిగిపోతే ఎంత మేలు జరుగుతుందో, వారి త్యాగం సమాజానికి ఏ ఫలితాలు ఇస్తుందో చెప్పాలి. వారిని నిర్వాసితులు కావడానికి ఒప్పించాలి. వారికి ఏ నష్టపరిహారం ఇస్తారో, ఏ పునరావాసం కలిపిస్తారో, ఎక్కడ ఎలా పునఃస్థిరీకరిస్తారో చెప్పాలి. ఇవన్నీ చట్టప్రకారం చేయవలసిన పనులే. ఇవేవీ ఇంతవరకూ జరగలేదు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు అనుకూల వర్గాలు బైట మాట్లాడడం, పత్రికలలో రాయడం, టివిలో మాట్లాడడం తప్ప ఇంతవరకూ ఆ గ్రామాలలో అడుగు పెట్టలేదు. మల్లన్న సాగర్‌కు అనుకూలంగా ప్రజలను బెదిరించడానికి గ్రామాలలో అడుగుపెట్టింది ఇంతవరకూ పోలీసులు, సాయుధ బలగాలు




*ముంపు బాధితుల దీక్షా శిబిరం, వేములగట్టు*

మాత్రమే. కనీసం ఆధునిక, పారదర్శక, ప్రజాస్వామిక పాలన అని చెప్పుకోవడం కోసమైనా ఇంత భారీ పథకపు వివరాలను వీలైనంత ఎక్కువమందికి అందుబాటులో ఉంచాలి. కాని మల్లన్నసాగర్ వివరాలు అట అటలుగా, ఇతరుల ప్రస్తావనల్లో, పరోక్షంగా తప్ప అధికారికంగా, ప్రత్యక్షంగా చెప్పినవి చాల తక్కువ. ప్రజలకు మేలు చేస్తుందనే పథకం గురించి ప్రజలకు అవసరమైన వివరాలు ప్రజలనుంచి రహస్యంగా దాచిపెట్టడం ఎందుకో పాలకులకే తెలియాలి.

అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007లో తయారు చేసిన ప్రాణహిత–చేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పథకపు పటాలే ఇవాళ్టికీ తెలంగాణ ప్రభుత్వ పత్రాలలో, ప్రభుత్వ వెబ్ సైట్ మీద కనబడుతున్నాయి. పాత పథకాల రూపకల్పనలను మార్చి, రిడిజైన్ చేస్తామనే మాట ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన ప్రకటనల్లో వినబడుతున్నది గాని ఇప్పటివరకూ అధికారిక పత్రాలలో, పటాలలో తడ్కపల్లి చెరువు పేరు మాత్రమే ఉంది. దాని స్థానంలో పది కిమీ దక్షిణంగా ప్రతిపాదిస్తున్న శ్రీ కొమరవెల్లి మల్లన్న సాగర్ ప్రస్తావనే లేదు. ప్రజా జీవితాలను, ఉపాధిని, స్థిర, చరాస్తులను, భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేసే పథకం గురించి ఆ ప్రభావిత ప్రజలతో చర్చించడం, వారికి సమాచారం అందించడం ప్రజాస్వామిక ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వాలు ఆ బాధ్యతను విధిగా నిర్వర్తించాలని చట్టబద్ధమైన ఆదేశాలు కూడ ఉన్నాయి. కాని తెలంగాణ ప్రభుత్వం బాధ్యతారహితంగా, చట్ట ఉల్లంఘనకు పాల్పడుతూ ప్రజల మీద ప్రభావం వేయబోయే ఈ భారీ పథకం గురించి నిజాలు చెప్పడం లేదు. లేదా నిజాలు దాస్తున్నది. వాస్తవ

సమాచారం ఇవ్వకుండానే, అవసరమైన సామాజిక, పర్యావరణ ప్రభావ మదింపు జరపకుండానే, అధికారికంగా ప్రకటించకుండానే ఈ లోపాయికారీ పథకానికి అడుగులు వేస్తున్నది. రెండు పంటలు పండే, విస్తారమైన నీటివసతి ఉన్న ఇరవై వేల ఎకరాల భూమిని, మూడువేలకు పైగా ఇళ్లను, పద్నాలుగు గ్రామాలను, ఏడు శివారు పల్లెలను ముంచివేసే భారీ పథకాన్ని రచించి, అమలు చేయడానికి పూనుకుంటున్నది.

డిసెంబర్ 2015లో ఎంఆర్ఓ కార్యాలయంలో ఎవరి సంతకమూ లేకుండా, అధికార పత్రం అవునో కాదో తెలియకుండా అతికించిన ఒక కాగితం మినహా ఇంతవరకూ ముంపు గురించి ప్రభుత్వ అధికారిక ప్రకటన ఏదీ లేదు. 2015 అక్టోబర్ 27న నీటి పారుదల, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ విడుదల చేసిన జీవో 776 మొదటిసారిగా మల్లన్న సాగర్ పేరు ప్రస్తావించి, "పాత పథకంలోని 6-8, 10-12 ప్యాకేజీలలో మార్పులు చేసి శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి శ్రీ కొమరవెల్లి మల్లన్న సాగర్‌కు అనుసంధానం కల్పించే పనులను రెండు సంవత్సరాలలో పూర్తి చేసే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతున్నది" అని రాశారు. అది ఎంత మంచి పని అయినా ఈ మార్పు వల్ల ఏం జరుగుతుంది, ఏ ప్రాంతాలు మునిగిపోతాయి, ఎన్ని గ్రామాలు, ఎన్ని ఎకరాల భూమి, ఎంత మంది ప్రజలు, ఎంత అడవి, ఎన్ని చారిత్రక, మత, సామాజిక నిర్మాణాలు మునిగిపోతాయి బహిరంగంగా చర్చ జరగవలసి ఉంటుంది. ఈ ముంపు అత్యవసరమైనదేనా, తక్కువ నష్టపు ప్రత్యామ్నాయాలు లేవా పరిశీలించవలసి ఉంటుంది. ముంపు అనివార్యమైతే న్యాయబద్ధమైన నష్టపరిహారం, పునరావాసం, పునఃస్థిరీకరణ గురించి చర్చ జరగవలసి ఉంటుంది. ఇవేమీ లేకుండా రెండు సంవత్సరాలలో పూర్తి చేయాలని ఒకానొక ప్రభుత్వ ఉత్తర్వులో అలవోకగా ఆదేశాలు విడుదలయ్యాయి. అవి విడుదలైన నెల, రెండు నెలలకు ఎం ఆర్ ఒ కార్యాలయంలో దాదూ ఫిర్యాదూ లేని కాగితం అంటించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు సర్వే అనీ, భూములు మునిగిపోతాయి గనుక తెల్ల కాగితాల మీదనో, ఎక్కువమందికి అర్థం కాని ఇంగ్లిష్‌లో ఏదో అచ్చయి ఉన్న కాగితాల మీదనో సంతకాలు తీసుకున్నారు. ఇలా "సంతకం పెట్టకపోతే ఇచ్చేది కూడ ఇవ్వరు, ఏమీ ఇవ్వకుండా భూమిని లాక్కునే అధికారం ప్రభుత్వానికి ఉంది" అని పోలీసులతో కలిసి వచ్చిన రెవెన్యూ అధికారులు బెదిరించారు.

ఆ బెదిరింపుల తర్వాతనే తమ భూములకూ, ఊళ్లకూ, బతుకులకూ, భవిష్యత్తుకూ ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నదని ఆ పద్నాలుగు గ్రామాల ప్రజల్లో బుగులు మొదలయింది. అది క్రమక్రమంగా ఆందోళనల రూపం తీసుకుంది. ఈ గ్రామాలనుంచి చదువుకుని, ఇతర ప్రాంతాల్లో ఉన్నతోద్యోగాలు చేస్తున్నవాళ్లు తమ జన్మభూమికి ఏదో ప్రమాదం ముంచుకు రాబోతున్నదని, దాన్ని తప్పించాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు.

చదువుకున్నవాళ్లు ఎక్కడెక్కడి సమాచారాన్నో పోగుచేసి రానున్న మహా విపత్తు ఎంత విస్తృతమైనదో చెప్పడంతో గ్రామీణులు ఈ విపత్తునుంచి బైటపడడానికి నిరసన దీక్షలు, నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ ఆందోళనలు ప్రారంభమై మూడు, నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నేరుగా ఆ గ్రామస్తులను కలిసి అధికారికంగా సమాచారం ఇవ్వడానికి పూనుకోలేదు. బాధిత ప్రజలకు, ఆందోళనకారులకు వ్యతిరేకంగా మాట్లాడడానికి, రాయడానికి, రాయించడానికి, ఇతర ప్రాంతాల ప్రజలకు ఎండమావుల నీళ్లు చూపి ప్రతికూల ఆందోళనలు జరిపించడానికి తీసుకున్న శ్రద్ధలో వందో వంతయినా ఆ ప్రాంతప్రజలతో మాట్లాడడానికి, ఏం జరగనున్నదో చెప్పడానికి వినియోగించలేదు. అధికారికంగా సమాచారం ప్రకటించకుండా, ఇలా ఒక భారీ పథకం గురించి దొడ్డిదారిన వార్తలు, వ్యాసాలు, అక్కడక్కడ ఉపన్యాసాల్లో ప్రస్తావనల ద్వారా బైటపెట్టడం ఇంకా ఎక్కువ అనుమానాలకు తావు ఇస్తున్నది.

అధికారిక పత్రాలలో, వెబ్ సైట్ల మీద లేకపోయినా, ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి, అధికారులు చేసిన ప్రకటనల్లో, ప్రభుత్వ సమర్థకులు రాస్తున్న వ్యాసాల్లో మల్లన్న సాగర్ గురించి ప్రస్తావనలు, అరకొరక భిన్నమైన అంకెలు వస్తున్నాయి. 2016 మార్చ్ 31న రాష్ట్ర శాసనసభలో నీటిపారుదల పథకాల మీద చేసిన పవర్ పాయింట్ ప్రసంగంలో ముఖ్యమంత్రి రిడిజైన్ చేసిన ప్రాణహిత–చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టుల గురించి చెపుతూ కొమరెల్లి మల్లన్న సాగర్ అనే పేరుతో 50 టిఎంసిల ప్రాజెక్టు రానున్నదని చెప్పారు. 2016 మే 2న కాళేశ్వరం ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన సందర్భంలో కూడ ఆ మాట మళ్లీ చెప్పారు. నీటి పారుదల శాఖ మంత్రి, ఇతర మంత్రులు, అధికారపార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, నాయకులు కూడ మల్లన్న సాగర్‌కు అనుకూలంగా పత్రికా సమావేశాల్లో మాట్లాడారు. టివి చర్చల్లో పాల్గొన్నారు. వ్యాసాలు రాశారు. ముఖ్యమంత్రి కార్యాలయ పౌర సంబంధాల అధికారులు కూడ మల్లన్న సాగర్‌ను సమర్థించే రచనలు చేశారు. ఇలా అనేకసార్లు ప్రస్తావనకు వచ్చినప్పటికీ, ఈ నివేదిక రాస్తున్న జూన్ 28 నాటికి కూడ ప్రభుత్వ పత్రాలలో, వెబ్ సైట్లలో మల్లన్న సాగర్ ప్రస్తావన లేదు. అధికారిక ప్రకటన లేదు. ఆ ప్రాజెక్టు అంత ప్రజోపయోగకరమైనదే అయితే దాన్ని ఇలా దొడ్డిదారిన తేవలసిన అవసరం లేదు.

ఈ లోపల ఒక విచిత్రం కూడ జరిగింది. ఏ నీటి పారుదల పథకానికైనా తప్పనిసరిగా తయారు చేయించవలసిన వివరమైన పథక నివేదిక (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ – డిపిఆర్) మల్లన్న సాగర్ గురించి ఇంతవరకూ తయారు కాలేదు. అది తయారు చేసే పనిని వ్యాప్కోస్ సంస్థకు ఇస్తున్నట్టు, వారికి ఆ నివేదిక తయారు చేయడానికి రెండు కోట్ల డెబ్బైరెండు లక్షల రూపాయల కాంట్రాక్టు ఇస్తున్నట్టు జూన్ 18న జీవో 571 వెలువడింది. అంటే ప్రజలకు తెలియజేయవలసిన వివరాలు తయారుచేసే పని

ప్రజాందోళన మొదలైన కొన్ని నెలలకుగాని ప్రభుత్వానికి గుర్తు రాలేదన్నమాట. ఈ డిపిఆర్ తయారు చేయడానికి వ్యాప్కోస్ సంస్థకు ప్రభుత్వం ఎంత గడువు ఇస్తున్నదో ఆ జీవోలో లేదు. కేంద్ర ప్రభుత్వం జలవనరుల వినియోగానికి సంబంధించి 2002లో విడుదల చేసిన మార్గదర్శక సూత్రాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టే ఏ నీటిపారుదల పథకానికైనా మొదట, సర్వే, పరిశోధనల వివరాలు, అంతర్రాష్ట్ర అంశాలు, హైడ్రాలజీ, నీటి పారుదల ప్రణాళిక, పర్యావరణ అంశాలు, ఆశిస్తున్న ప్రయోజనాలు వగైరాలతో ఒక ప్రాథమిక నివేదిక తయారు చేయాలి. ఆ నివేదిక ప్రతిపాదిత పథకం ఎంత సమంజసమైనదో, అవసరమైనదో నిర్ధారించగలిగి ఉండాలి. ఆ నివేదిక ప్రాతిపదిక మీదనే డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీకి రంగం సిద్ధమవుతుంది. కాని మల్లన్న సాగర్ విషయంలో ప్రాథమిక నివేదిక లేదు. సర్వేలు లేవు, ప్రాథమిక నివేదికలో ఉండవలసిన అంశాల మీద చర్చేలేదు. ఈలోగానే డిపిఆర్ కోసం దాదాపు మూడు కోట్లు ఇవ్వడానికి నిర్ణయం జరిగిపోయింది. వ్యాప్కోస్ కేంద్ర ప్రభుత్వ రంగంలోని సలహా సంస్థ అనే మాట నిజమే గాని, శాసనసభ ప్రసంగంలో స్వయంగా ముఖ్యమంత్రే చెప్పినట్టు, ప్రాణహిత – చేవెళ్ల పథకంలో ఈ వ్యాప్కోస్ సంస్థే గతంలో తప్పుడు నివేదిక తయారు చేసింది. అలా ఎందుకు చేశారని తాను ఆ అధికారులను అడిగానని, అప్పటి రాజకీయ నాయకులు అలా చేయించారని వారు చెప్పారని అక్షరాలా ముఖ్యమంత్రే శాసనసభా వేదిక మీద అన్నారు. అంటే, ఆ సంస్థకు వాస్తవాన్ని వాస్తవంగా చెప్పే అలవాటు లేదని, అధికారంలో ఉన్నవారు ఏ నివేదిక ఇమ్మంటే ఆ నివేదిక ఇస్తుందని స్వయంగా ఆయనే ఒప్పుకున్నారన్నమాట. అటువంటి ఘన చరిత్ర గల సంస్థకు, అక్రమ నివేదికలు తయారుచేసిందని తానే ఆరోపించిన సంస్థకు ప్రస్తుతం డిపిఆర్ తయారుచేసే పని అప్పగించడమంటే, ఇవాళ తాను అధికారంలో ఉన్నందువల్ల తాను కోరుకున్న నివేదికను ఆ సంస్థ ఇస్తుందని చెప్పకనే చెప్పినట్టయింది.

## *అసలీ పథకం ఏమిటి?*

ప్రభుత్వం స్పష్టంగా, నిర్దిష్టంగా, కచ్చితంగా చెప్పకపోయినా, అనేక వనరుల నుంచి ముక్కలు ముక్కలుగా వస్తున్న సమాచారాన్నంతా ఒక్కదగ్గరికి చేరిస్తే, దానిలో భిన్న కథనాల మధ్య వాస్తవాన్ని గ్రహిస్తే, అరకొరగా చెపుతున్న వాటి నుంచి వాస్తవం ఏమై ఉంటుందో నిర్ధారిస్తే, అసలు ఈ పథకం ఏమిటో ఒక అంచనాకు రావచ్చు.

ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు పూర్వరూపం తడ్కపల్లి చెరువు. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా 2007లో తయారు చేసిన, 2008 ఏప్రిల్ 11న శంకుస్థాపన చేసిన ప్రాణహిత – చేవెళ్ల ఎత్తిపోతల భారీ పథకంలో అనుసంధానం చేసిన 23 జలాశయాలు/చెరువులలో తడ్కపల్లి చెరువు ఒకటి.

అప్పుడు దాని ప్రతిపాదిత నీటి నిలువ సామర్థ్యం 1.5 టిఎంసిలు (టిఎంసి అంటే థౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్ – శతకోటి ఘనపుటడుగుల నీరు – 2831 కోట్ల లీటర్ల నీరు). ఆ తర్వాత డా. బి ఆర్ అంబేద్కర్ ప్రాణహిత – చేవెళ్ల సుజల స్రవంతి అని పేరు మార్చిన ఈ పథకానికి రు. 17,875 కోట్లు ఖర్చు అవుతాయని 2007 మేలో అంచనా వేశారు. త్వరలోనే కొన్ని అదనపు లక్ష్యాలు కలిపి 2008 డిసెంబర్ నాటికి ఈ అంచనాను రు. 38,500 కోట్లకు పెంచారు. దీనివల్ల 12.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని మొదట ప్రకటించి, దాన్ని 16.4 లక్షల ఎకరాలకు పెంచారు. ఆ ప్రాజెక్టును, నాలుగు సంవత్సరాలలో, 2012 నాటికి పూర్తి చేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత దాన్ని ఎనిమిది సంవత్సరాలకు పొడిగించింది. ఈ వాగ్దానాలు, ప్రకటిత లక్ష్యాలు అన్నీ అబద్ధాలేనని కాలక్రమంలో రుజువయ్యాయి. జలయజ్ఞంలోని మిగిలిన ప్రాజెక్టులన్నిటిలాగే వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు దక్కాయి గాని నీళ్లు రాలేదు. అదనపు ఆయకట్టు ఏర్పడలేదు.

అసలు మొత్తంగా జలయజ్ఞం పేరుతో వచ్చిన అనేక నీటి పారుదల పథకాలతో జరిగినది జలయజ్ఞం కాదనీ, ఒక లక్షా ఎనబై ఆరు వేల కోట్ల రూపాయల మాయ అనీ ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణ పక్షపత్రిక డౌన్ టు ఎర్త్ 2012 జూలైలోనే రాసింది. “పెట్టుబడుల అనుమతులు లేకుండానే 24 ప్రాజెక్టులు ప్రారంభించారు. 21 ప్రాజెక్టులకు అటవీ అనుమతులు లేవు. 18 ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవు. నాలుగు ప్రాజెక్టులకు సాధ్యతా నివేదికలు లేవు. పదహారు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం అనుమతులు లేవు” అని రాజ్యాంగ బద్ధ సంస్థ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చెప్పింది. ఈ కుంభకోణం మీద విస్తృత పరిశోధన చేసిన ఫస్ట్ పోస్ట్ వెబ్ సైట్ ప్రకారం ఒక లక్షా ఎనబై ఆరువేల కోట్ల రూపాయల జలయజ్ఞంలో ఏ పనీ జరగకుండానే తొంభైవేల కోట్లు రాజకీయ నాయకులకు, రాజకీయ నాయకులైన కాంట్రాక్టర్లకు, వారి ఆశ్రితులకు దక్కాయి.

2012లోనే కాగ్ ప్రత్యేకంగా జలయజ్ఞం మీద ఒక నివేదిక ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం ప్రాణహిత – చేవెళ్ల పథకం కింద అప్పటికి ఎన్నో అవకతవకలతో రు. 2205 కోట్లు ఖర్చయి (కాంట్రాక్టర్లకు దక్కి) ప్రకటిత లక్ష్యాలలో పదోవంతు కూడ అమలులోకి రాలేదు. ఆ తర్వాత 2015 జనవరిలో అధికారిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు పేరు మీద రు. 7000 కోట్లు ఖర్చయి, కాంట్రాక్టర్లకు దక్కాయి గాని, ప్రధాన ఆనకట్ట ఎత్తు ఎంత ఉండాలనే నిర్ణయమే జరగలేదు. అలా అసలు ప్రధానాంశమే తేలకుండా ఇంతింత ఖర్చు జరిగిపోయిందంటే, ఈ ప్రాజెక్టు ప్రజల కోసం కాదనీ, నీళ్ల కోసం కాదనీ, కాంట్రాక్టర్ల బొక్కసాలు నింపడానికి మాత్రమేననీ సులభంగా అర్థం చేసుకోవచ్చు. పేరుకు కొన్ని చోట్ల కాలువలు తవ్వడం జరిగింది గాని అవి అవసరమైన

లోతు కాలువలు కావు. పూర్తి కాలువలు తవ్వినట్టుగా కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరయ్యాయి. తవిన కాలువలు పూడిపోయాయి. ఎక్కడైనా, ఎవరికైనా నీళ్లు అందితే అది ద్వితీయ స్థాయి, ఉప ఉత్పత్తి మాత్రమే గాని ప్రధానోత్పత్తి కాంట్రాక్టర్ల బొక్కసాలు నింపడమేనని కాగ్ నివేదికే స్పష్టం చేసింది. ప్రాణహిత – చేవెళ్ల పథక రచన ఒక కుట్ర అని స్వయంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావే శాసనసభ ప్రసంగంలో అభివర్ణించారు. ఈ పథకం పేరు మీద ఎనిమిదివేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఆయనే అన్నారు.

అలా పాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసం మాత్రమే తయారు చేసిన ఆ అవకతవకల, అక్రమాల పథకాన్నే తెలంగాణ ప్రభుత్వం దుమ్ముదులిపి, అలంకరించి, మళ్లీ ముందుకు తెచ్చింది. ఈ అలంకరణ పేరే రిడిజైనింగ్. పాత ప్రాజెక్టుల రూపకల్పన తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జరగలేదని, కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని జరిగిందని, అందువల్ల తెలంగాణ ప్రభుత్వం అనివార్యంగా రిడిజైనింగ్ చేయవలసి వస్తున్నదని ముఖ్యమంత్రి నిజంగానే అభినందించదగిన మాట అన్నారు. ఆ మాట విన్న ఎవరైనా రిడిజైనింగ్ లో పాత కాంట్రాక్టర్ల తొలగింపు అనివార్యంగా ఉంటుందని ఆశిస్తారు. కాని రిడిజైనింగ్‌లో ఏ ఒక్క ప్రాజెక్టులోనూ కాంట్రాక్టర్లు మారలేదు.

రిడిజైనింగ్ లో భాగంగా 1.5 టిఎంసి నీటి నిలువ సామర్థ్యంతో ఉండిన తడ్కపల్లి చెరువును తొలగించి, దాని స్థానంలో మల్లన్న సాగర్ నిర్మించాలని తలపెట్టారు. మల్లన్న సాగర్ నీటి నిలువ సామర్థ్యాన్ని ఏకాఏకిన 50 టిఎంసిలకు పెంచారు. అంతకు ముందరి రు. 38,500 కోట్ల పథకమల్లా, ప్రస్తుతం రిడిజైనింగ్‌తో రు. 83,000 కోట్ల పథకంగా మారింది. ప్రాంతం మారింది, పథకం మారింది, పేరు మారింది. సామర్థ్యం మారింది, ఖర్చు రెట్టింపు అయింది. కాని, ఆశ్చర్యకరంగా కాంట్రాక్టర్లు మాత్రం మారలేదు. ఒకటిన్నర టిఎంసిల సామర్థ్యపు ప్రాజెక్టు గుత్తెదారులే, ముప్పై ఆరు రెట్లు సామర్థ్యం పెరిగిన ప్రాజెక్టుకూ పనికి వచ్చారు. ఆ గుత్తెదార్లు రెండు నిర్మాణ కంపెనీలు కలిసి ఏర్పడిన సంయుక్త సంస్థ. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎం ఇ ఐ ఎల్ – మేఘా పేరుతో రాష్ట్రంలో ఇంకా ఎన్నో ప్రాజెక్టులు సొంతం చేసుకున్న కంట్రాక్టర్ కంపెనీ) ఆ రెండిటిలో ఒకటి. ఇది మాజీ ముఖ్యమంత్రి డా. వై ఎస్ రాజశేఖర రెడ్డి సహచరుడు, కాంగ్రెస్ నాయకుడు డా. కె వి పి రామచంద్రరావు బేనామీ కంపెనీ అనీ, లేదా ఆయనకు వాటాలు ఉన్న కంపెనీ అనీ వదంతులున్నాయి. ఎస్ ఇ డబ్ల్యు ఇన్ఫ్రాస్ట్రక్చర్ (సూ అనే పేరుతో ప్రఖ్యాతమైన సదరన్ ఇంజనీరింగ్ వర్క్స్ అనే కంపెనీ) అనేది రెండవది. ఇదే కంపెనీ తెలంగాణ ఆకాంక్షలకు వ్యతిరేకమైన, మూడు లక్షల మంది ఆదివాసులను నిర్వాసితులను చేస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. దీనిలో నమస్తే తెలంగాణ దినపత్రిక మాజీ యజమాని, ప్రస్తుతం

భారతీయ జనతా పార్టీలో ఉన్న సి ఎల్ రాజంకు వాటాలు ఉన్నాయని అంటారు. ఈ రెండు నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలు కూడ ప్రాంభించినదీ, ఇప్పటికీ నడుపుతున్నదీ కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తులు. తెలంగాణ ఉద్యమకాలంలో విమర్శలకు గురైన కాంట్రాక్టర్ల కూటములకు చెందినవారు. కాకపోతే, ఈ రెండు కంపెనీలలో నేరుగానో, బేనామీగానో తెలంగాణ సంపన్నుల ప్రయోజనాలు కూడ ఉన్నాయని వదంతులున్నాయి.

పాత డిజైన్‌లోని తడ్కపల్లి సముద్రమట్టానికి 1663 అడుగుల (506 మీటర్ల) ఎత్తున ఉంది. తిప్పారం చెరువు 1762 అడుగుల (537 మీటర్ల) ఎత్తున ఉంది. ఈ వంద అడుగుల వ్యత్యాసం మధ్యలో ఉన్న ప్రాంతంలో ఏటిగడ్డ కిష్టాపూర్ 1713 అడుగుల (522 మీటర్ల) ఎత్తున, వేములగట్టు 1736 అడుగుల (529 మీటర్ల) ఎత్తున ఉన్నాయి. మరొక పక్కన మాతపల్లి 1873 అడుగుల (570 మీటర్ల) ఎత్తున కూడ ఉంది. గోదావరి మీద 325 అడుగుల (100 మీటర్ల) ఎత్తున ఉన్న కాళేశ్వరం నుంచి 938 అడుగుల ఎత్తున (285 మీటర్ల) ఎత్తున ఉన్న మిడ్ మానేరు జలాశయానికి నీళ్లు తెచ్చి, అక్కడి నుంచి మరొక 150 మీటర్లు పైకి ఎక్కించి మల్లన్న సాగర్ నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్, వేములగట్టుల నుంచి మాతపల్లి దాకా విస్తరించిన పద్నాలుగు గ్రామాలలోని 20,079 ఎకరాల భూమిలో ఈ జలాశయం నిర్మించాలని ఆలోచిస్తున్నారు. ఎం ఆర్ వో ఆఫీసులో అతికించిన కాగితం ప్రామాణికమే అనుకుంటే, దాని ప్రకారం తొగుట మండలంలోని బ్రాహ్మణ బంజర్ పల్లి, ఏటిగడ్డ కిష్టాపూర్ (తిరుమలగిరి, మొగుళ్లచెరువు తండాలతో సహా), వేములగట్టు (తురక బంజర్ పల్లితో సహా), పల్లెపాడు (దస్తగిరి నాగారంతో సహా), కొండపాక మండలంలోని తిప్పారం (సింగారంతో సహా), ఎర్రవల్లి, మంగోలు (కాశె గుడిసెలు తో సహా), కోనాయపల్లి (వడ్డెరకాలనీతో సహా) గ్రామాల్లో ఇళ్లూ భూములూ అన్నీ ముంపుకు గురవుతాయి. తొగుట మండలం తుక్కాపూర్, తొగుట, ఎల్లారెడ్డిపేట, కొండపాక మండలం మాతపల్లె, మేదినీపూర్, ముద్దారం గ్రామాల్లో భూములు మాత్రం ముంపుకు గురవుతాయి. మొత్తంగా 3112 ఇళ్లు, 20079 ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని అంచనా.

**కొమరవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్**
**ముంపుకు గురయ్యే గ్రామాలు, ఇళ్లు, అవసరమైన భూమి విస్తీర్ణం**

| క్ర.సం. | గ్రామం పేరు | మండలం | ఇళ్ల సంఖ్య | అవసరమైన భూమి | వివరాలు |
|---|---|---|---|---|---|
| 1. | బ్రాహ్మణ బంజర్ పల్లి | తొగుట | 137 | | ముంపు |
| 2. | ఏటిగడ్డ కిష్టాపూర్ | తొగుట | 409 | 2526 | ముంపు |
| | తిరుమలగిరి | | 68 | | ముంపు |
| | మొగుళ్లచెరువు తాండా | | 93 | | |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 3. | వేములగట్టు | తొగుట | 544 | 5398 | ముంపు |
| | తురక బంజర్ పల్లి | | 71 | | ముంపు |
| 4. | పల్లెపాడు | తొగుట | 320 | 1199 | ముంపు |
| | దస్తగిరి నాగారం | | 152 | | ముంపు |
| 5. | తిప్పారం | కొండపాక | 250 | 1290 | ముంపు |
| | సింగారం | | 120 | 1053 | |
| 6. | ఎర్రవల్లి | కొండపాక | 348 | 2297 | ముంపు |
| 7. | మంగోలు | కొండపాక | 450 | 1851 | ముంపు |
| | కాశె గుడిసెలు | | 20 | | |
| 8. | కోనాయపల్లి | కొండపాక | 105 | 444 | ముంపు |
| | వడ్డెర కాలనీ | | 15 | | |
| 9. | తుక్కాపూర్ | తొగుట | - | 972 | భూమి మాత్రమే |
| 10. | తొగుట | తొగుట | - | 2703 | భూమి మాత్రమే |
| 11. | ఎల్లారెడ్డిపేట | తొగుట | - | 142 | భూమి మాత్రమే |
| 12. | మాతపల్లె | కొండపాక | - | 44 | భూమి మాత్రమే |
| 13. | మేదినీపూర్ | కొండపాక | - | 117 | భూమి మాత్రమే |
| 14. | ముద్దారం | కొండపాక | - | 40 | భూమి మాత్రమే |
| | | | 3112 | 20079.16 | |

ఈ ప్రాంతం ఇంత ఎత్తున ఉండడం వల్ల, నీరు పల్లమెరుగు అన్నట్టుగా, ఇక్కడినుంచి ఇతర ప్రాంతాలకు నీరు సహజంగా కాలువల ద్వారా ప్రవహిస్తుందని ప్రాజెక్టు సమర్థకులు అంటున్నారు. అయితే పాత ప్రణాళికలో తడ్కపల్లి చెరువు తర్వాత ఉన్న తిప్పారం చెరువు తడ్కపల్లి కన్న వంద అడుగుల ఎత్తున, ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న ప్రాంతానికి సగటున యాభై అడుగుల ఎత్తున ఉంది. ఎత్తే ప్రధానమైతే తిప్పారం ఎక్కువ యోగ్యమైన స్థలం కావాలి. మల్లన్న సాగర్ ప్రతిపాదిత ప్రాంతం మిడ్ మానేర్ జలాశయం కన్న దాదాపు 900 అడుగుల ఎత్తులో, దాదాపు 70 కిమీ దూరంలో ఉంది. ఈ దూరంలో కొంతభాగం కాలువల ద్వారా, కొంత పైప్ లైన్ల ద్వారా నీరు ప్రవహిస్తుందని అంటున్నారు. కాలువకైనా, పైప్ లైన్ కైనా ఎత్తిపోతలు (లిఫ్ట్) తప్పవు. ఆ ఎత్తిపోతలకు ఎంతో విద్యుత్తు అవసరం అవుతుంది. ఎత్తునుంచి నీరు పల్లానికి ప్రవహించడం ఎంత సులభమో, కింది నుంచి పైకి తీసుకుపోవడం అంతే కష్టం. అయినా పాత ప్రణాళిక ప్రకారం వంద అడుగుల తక్కువ ఎత్తున ఉన్నప్పుడు పైకి ఎక్కించవలసిన నీరు 1.5 టిఎంసి కాగా, ఇప్పుడు వంద అడుగుల ఎత్తూ పెరిగింది.



ముంపుకు గురి అవుతున్న రెండు పంటలు పండే పొలాలు

దానితోపాటు 48.5 టిఎంసి అదనంగా పైకి ఎక్కించవలసిన అవసరమూ వస్తుంది. నీటిని అంత ఎత్తుకు ఎత్తిపోతలు జరపడానికి అవసరమైన విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల గురించి ఇప్పటికైతే సమాచారం లేదు. ఆ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు ఎక్కడ వస్తాయో, వాటికోసం మరెంతమందిని నిర్వాసితులను చేస్తారో, వాటికి ఎంత ఖర్చవుతుందో, ఆ ఖర్చు కలిపితే నీటి ఖరీదు ఎంత పెరుగుతుందో జవాబు లేని ప్రశ్నలెన్నో ఉన్నాయి. అన్ని విషయాలూ పాము మంత్రం లాగ రహస్యంగా గుప్పిట్లో పట్టుకుని ఉండడమే మరిన్ని అనుమానాలకు దారి తీస్తున్నది.

ప్రభుత్వం అరకొరగా విడుదల చేస్తున్న లెక్కలలో మరొక అసంగతం కూడ ఉంది. మల్లన్న సాగర్ 50 టిఎంసిల సామర్థ్యంతో నిర్మిస్తామని, దీనితో మెదక్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు నీరందిస్తామని ప్రభుత్వనేతలు, సమర్థకులు చెపుతున్నారు. వాస్తవ గణాంకాలు చెప్పే డిపిఆర్ అందుబాటులో లేదు గనుక 'బొంకరా బొంకరా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయలంత' అనే సామెత లాగ ఎవరి ఇష్టం వచ్చిన గణాంకాలు వారు చెపుతున్నారు. ఈ రిజర్వాయర్ వల్ల ఆరు లక్షల ఎకరాలకు నీరందుతుందని ఒకరు, పది లక్షల ఎకరాలకు నీరందుతుందని మరొకరు, పద్దెనిమిది లక్షల ఎకరాలకు నీరందుతుందని ఇంకొకరు నోటికి వచ్చిన అంకె చెపుతున్నారు. ఒకరైతే తానే కొలిచినట్టుగా, లేదా డిపిఆర్ చూసినట్టుగా పది లక్షల ఇరవై మూడు వేల ఎకరాలు (నయం, అక్కడికి ఆపారు, నాలుగువందల ఇరవై ఒకటి అని ఆ తర్వాత అంకె కూడ చెప్పలేదు!!) అని కచ్చితమైన అంకె కూడ ప్రకటించారు.

ఎప్పుడూ ఎక్కడా జలాశయాల్లో చెప్పిన నీటి సామర్థ్యం ఉండదు. ఆవిరి

అయిపోవడం, ఇంకిపోవడం అనే నష్టాల వల్ల ప్రకటిత సామర్థ్యంలో 40 శాతం తగ్గించాలని ఏ ఇంజనీరునడిగినా చెపుతారు. అంటే మల్లన్న సాగర్ యాభై టిఎంసిల నీటి నిలువ సామర్థ్యం అని చెప్పినా, వాస్తవంగా 30 టిఎంసిల కన్న ఎక్కువ ఉండదని అర్థం. అందులోనూ మరొక ప్రభుత్వ సమర్థన వ్యాసంలో రాసినట్టు 10 టిఎంసిలు పారిశ్రామిక అవసరాల కోసం కేటాయిస్తారని తెలుస్తున్నది. అంటే మొత్తం మీద మల్లన్నసాగర్ కడితే, గిడితే దాని నుంచి నీటి పారుదలకు 20-25 టిఎంసిల కన్న ఎక్కువ నీరు రావడం అసాధ్యం. ఒక టిఎంసి తో పదివేల ఎకరాలకు నీరు పారించవచ్చుననేది కూడ ఒక ప్రామాణిక లెక్క. అంటే మల్లన్న సాగర్ నిజంగా కడితే రెండు, రెండున్నర లక్షల ఎకరాల కన్న ఎక్కువ ఆయకట్టు ఏర్పడే అవకాశం లేదు. 'ఇవన్నీ అధిగమిస్తాం, రిజర్వాయర్ లో 50 టిఎంసిలు ఉండేలా, ఆ నీరంతా వ్యవసాయానికే అందేలా చూస్తాం' అని వాగ్దానం చేసినా, 50 టిఎంసిలతో ఏర్పడబోయే ఆయకట్టు ఐదు లక్షల ఎకరాలు. మరి ఆరు, పది, పద్దెనిమిది అని ప్రగల్భాలు ఎందుకు, ఎవరిని మోసం చేయడానికి పలుకుతున్నారు? జలాశయం మొత్తం సామర్థ్యంతో వచ్చినా, అదంతా వ్యవసాయానికే వాడినా ప్రభుత్వం చెపుతున్నట్టు, సమర్థకులు నమ్మబలుకుతున్నట్టు భోనగిరి, ఆలేరు వంటి నల్లగొండ జిల్లా ప్రాంతాలకు, కామారెడ్డి, ఎల్లారెడ్డి వంటి నిజామాబాద్ జిల్లా ప్రాంతాలకు, సింగూరు, నిజాంసాగర్ జలాశయాలకు నీరు అందించడం అసాధ్యం, అబద్ధం. మెదక్ జిల్లాలోనే జిల్లా మొత్తం విస్తీర్ణం 23 లక్షల ఎకరాలలో ఐదో వంతు, పదో వంతు భూమికి నీరు ఇవ్వడానికి కూడ మల్లన్న సాగర్ సరిపోదు. అరచేతిలో వైకుంఠం చూపి, చుట్టూ జిల్లాల రైతులను రెచ్చగొట్టి, ఈ ప్రాంత ప్రజల భూములు లాక్కొని, ప్రాజెక్టు పేరుమీద కాంట్రాక్టర్లకు దోచి పెట్టడానికి తప్ప ఈ ప్రాజెక్టు ప్రతిపాదనవల్ల మరే ఉపయోగమూ లేదు. ఈ వాస్తవం తెలియని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల రైతులకు అబద్ధాలు చెపుతూ, వారిని రెచ్చగొట్టి మల్లన్న సాగర్ నిర్మాణానికి అనుకూల కుహనా ఆందోళనలు సృష్టించే నీచపు ఎత్తుగడలకు కూడ పాలకులు పూనుకుంటున్నారు.

అలాగే ఎప్పుడైనా నది, ఉపనది, ఏరు, వాగు వంటి నీటి ప్రవాహాల మీద అనుకూలమైన చోట అడ్డంగా ఆనకట్ట కట్టి జలాశయాలు నిర్మిస్తారు. ఇప్పుడు మల్లన్నసాగర్ నిర్మించదలచిన చోట కుడ్లేరు వాగు ఉంది గాని ప్రతిపాదిత జలాశయం దానికి అడ్డంగా కాదు. కాళేశ్వరం నుంచి మధ్య మానేరు మీదుగా కాలువలో లేదా పైప్ లైన్ల ద్వారా వచ్చిన నీటిని నిలువ చేయడానికి మాత్రమే మల్లన్న సాగర్ జలాశయం అంటున్నారు. అంటే ఈ జలాశయానికి మామూలుగా ఒకవైపు ఆనకట్ట కాక, చుట్టూ నాలుగువైపులా కట్టపోయవలసి ఉంటుంది. అది ఒక సాంకేతిక సమస్య. ప్రభుత్వం అధికారికంగా సమాచారం బైటపెట్టడం లేదు గనుక అక్కడక్కడా దొరుకుతున్న

సమాచారాన్ని కలిపి చూస్తే అరవై మీటర్ల ఎత్తున, 24 కిలోమీటర్ల చుట్టుకొలతతో కట్ట నిర్మిస్తారని తెలుస్తున్నది. ఈ కట్ట నిర్మించాలంటే పదమూడు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమవుతుందని, అంత పెద్దమొత్తంలో నాణ్యమైన, అవసరమైన మట్టి దొరుకుతుందా అని సాంకేతిక నిపుణులు కూడ సందేహం వ్యక్తం చేస్తున్నారని ఒక పత్రిక రాసింది. పోనీ అలా కట్టినా, అంత ఎత్తున కూడ ఆ ఇరవై వేల ఎకరాల విస్తీర్ణమూ సమతలంగా ఏమీ లేదు, వంద నుంచి నూట యాభై అడుగుల ఎత్తు వంపులు ఉన్నాయి. అంటే మొత్తంగా అనుకున్నట్టు 50 టిఎంసిలో 30 టిఎంసిలో నీరు రాకపోతే మొదట ఆ వంపుల్లో మాత్రమే నీరు నిలుస్తుంది. అంటే ప్రభుత్వం, సమర్థకులు చెపుతున్నట్టుగా, ఆ జలాశయం నిజంగా ఏర్పడినా దాని కింది కాలువలకు నీరు అందుతుందా అనుమానమే.

అంత పెద్ద ఎత్తున 50 టిఎంసిల జలాశయం ఏర్పడితే దానివల్ల భూమి మీద ఒత్తిడి పెరిగి భూకంపాలకు అవకాశం వస్తుందా అని సీస్మిక్ పరిశోధనలు జరపవలసి ఉంటుంది. మహారాష్ట్రలో కోయ్నా జలాశయం ఒత్తిడివల్ల 1967లో భూకంపం వచ్చి, ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరిగినప్పటి నుంచి, ప్రతి పెద్ద జలాశయం గురించీ ఈ పరిశోధనలు జరగడం తప్పనిసరి అయింది. కాని మల్లన్న సాగర్ విషయంలో దాని గురించి ఇంతవరకు చర్చే లేదు.

ఇవేవీ లేకుండానే, లేదా బహిరంగంగా ప్రకటించకుండానే 50 టిఎంసిల, మూడువేల కోట్ల రూపాయల (మళ్లీ ఈ అంకె కూడ అనుమానమే. ప్రభుత్వ అధికారిక సమాచారం లేదు గనుక మూడు వేల కోట్ల రూపాయల నుంచి తొమ్మిది వేల కోట్ల రూపాయల వరకూ వేరువేరు అంచనాలున్నాయి!), ఇరవై వేల ఎకరాల ముంపు పథకం చాప కింద నీరులా అమలు చేయబోతున్నారు. పెద్ద పెద్ద అంకెలు చూపి భయపెట్టడానికో, కాంట్రాక్టర్లకు మేలు చేయడానికో తప్ప అక్కడ అంత నీటి నిలువ అవసరం లేదు, అవకాశం లేదు, వాస్తవంగా అలా నీరు నిలువయ్యేదీ లేదు. పెద్ద ఎత్తున ఆయకట్టు పెరిగేదీ లేదు. వ్యవసాయానికీ దుర్భిక్ష ప్రాంతాలకూ నీరు అందించడం పేరుతో భారీ భూసేకరణ జరిపి, తర్వాత కాలంలో సాంకేతికంగా ఇది సాధ్యమయ్యే ప్రాజెక్టు కాదని చెప్పి, ఏ పది, పదిహేను టిఎంసిల ప్రాజెక్టో నిర్మించి ఈ ప్రాంతంలోని కార్పొరేట్ వ్యవసాయ దారులకు, రానున్న పరిశ్రమలకు నీరు అందించే ప్రయత్నం, సేకరించిన భూమిని బహుళ జాతి సంస్థలకు అమ్మే ప్రయత్నం చేసినా ఆశ్చర్యపోనక్కరలేదు.

## లెక్కలేనన్ని చట్ట ఉల్లంఘనలు

ఇటువంటి ప్రాజెక్టులు నిర్మించదలచినప్పుడు ప్రజా ప్రయోజనాల రీత్యా తీసుకోవలసిన జాగ్రత్తలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అనుమతులు, సమాచారాన్ని

వీలైన అన్ని పద్ధతులలో ప్రభావిత ప్రజలతో పంచుకొని వారి అనుమతి తీసుకోవడం, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను ప్రజల సంపూర్ణ సమాచారంతో, అనుమతితో తీసుకోవడం, ప్రాజెక్టు వల్ల ప్రభావితులయ్యే, నష్టపోయే ప్రజలకు న్యాయబద్ధమైన నష్టపరిహారం చెల్లించడం, అటువంటి బాధిత ప్రజలందరికీ పునరావాసానికి, పునః స్థిరీకరణకు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో ముందస్తు చర్యలు చేపట్టాలని చట్టం నిర్దేశిస్తుంది. అందులోనూ, అంతకుముందున్న భూసేకరణ చట్టాలు ప్రజలకు అనుకూలంగా లేవని, అందువల్ల ప్రజా ప్రయోజనాల కోసం ఒక సమగ్ర చట్టం తేవాలని సమాజంలో వెల్లువెత్తిన ఆకాంక్షలకు స్పందనగా 2013 భూసేకరణ, పునరావాసం, పునఃస్థిరీకరణలలో న్యాయబద్ధమైన నష్టపరిహారం, పారదర్శకతల హక్కు చట్టం తయారయింది. ఆ కేంద్ర చట్టాన్ని అనుసరిస్తూ తమ సొంత నిబంధనలు తయారు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 డిసెంబర్ 19న జీవో 50 ద్వారా ఆ నిబంధనలను ప్రకటించింది.

కాని ఎనిమిది నెలలు తిరగకుండానే ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ, తన సొంత నిబంధనలను తానే తోసివేస్తూ జీవో 123 ప్రకటించి మల్లన్నసాగర్ విషయంలో దాన్ని అమలు చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. ఆ క్రమంలో చట్టబద్ధ పాలనకు లెక్కలేనన్ని తూట్లు పొడుస్తున్నది. ప్రభావిత ప్రాంతపు పంచాయతీకి సమాచారం ఇవ్వడం, సర్వే జరపడం, ఎంత నష్టం జరుగుతుందో అంచనావేయడం, ఇది గత్యంతరం లేని ప్రాజెక్టా, ప్రత్యామ్నాయం ఉందా అని పరిశీలించడం, సామాజిక ప్రభావ మదింపు నివేదికను బహిరంగంగా ప్రకటించడం, ఆ ప్రభావాలలోని ప్రతికూల అంశాలను ఎలా అధిగమిస్తామో వ్యూహం తయారుచేసి ప్రజలతో బహిరంగంగా పంచుకోవడం, గ్రామసభ ఏర్పాటు చేయడం, రెండు పంటల భూమి అయితే ఎనబై శాతం ప్రజల ఆమోదం ఉంటేనే ప్రాజెక్టును ప్రారంభించడం, ప్రాజెక్టును స్వతంత్ర, ప్రభుత్వేతర నిపుణుల బృందంతో పరీక్షింపజేయడం, బాధిత ప్రజలకు న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం, పనఃస్థిరీకరణ కల్పించడం, ఈ పనులన్నీ పారదర్శకంగా, బహిరంగంగా చేయడం అనే తప్పనిసరిగా చేయవలసిన చట్టపరమైన చర్యలన్నిటినీ ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నది.

2013 చట్టంలో "ప్రభావిత కుటుంబాలకు మరింత ప్రయోజనకరమైన చట్టాలను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర శాసన సభలకు అధికారం" ఉంది అనే సెక్షన్ 107ను ఊతగా తీసుకుని, "మరింత ప్రయోజనం" లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం తన చట్టాన్ని రూపొందించడానికి ప్రయత్నించింది. శాసనసభ చట్టం కూడ కాకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా 2013 చట్టాన్ని దాటవేయడానికీ, ఉల్లంఘించడానికీ ప్రయత్నించింది. అలా వచ్చినదే జీవో 123.

ఈ జీవో 123 తెలంగాణ ప్రభుత్వం ప్రతిరోజూ విమర్శించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ

ఉత్తర్వులకు అనుకరణ. ప్రజలకు అన్యాయం చేసే దగ్గర తెలంగాణ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే ఆదర్శంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం పేరిట రెండు పంటల, సంపన్నమైన, నదీతీర భూమిని ఆక్రమించడానికి 2013 చట్ట నిబంధనలు అడ్డం వస్తాయి గనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015 మే 14న జీవో 166 తీసుకువచ్చింది. 2013 చట్టంలో పునరావాసం గురించీ, పునఃస్థిరీకరణ గురించీ ప్రభుత్వం మీద నిబంధనలు విధించే రెండు అధ్యాయాలు రాజధాని భూసేకరణకు వర్తించబోవనీ, ప్రజలు “ఇష్టపూర్వకంగా” తమ భూమిని ప్రభుత్వానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారనీ ఈ జీవో చెప్పింది. ఆ జీవోకు అదనంగా జూలై 13న మరొక జీవో 262 తెచ్చి, భూసేకరణ అనేది భూయజమానికీ కలెక్టర్ కూ మధ్య జరిగే లావాదేవీ మాత్రమేనని నిర్ధారించారు.

తెలంగాణ ప్రభుత్వం ఈ రెండు జీవోలను అనుకరిస్తూ, 2015 జూలై 30న జీవో 123 తెచ్చింది. ప్రజా పథకాలకు భూమిని త్వరితగతిన సమకూర్చడం కోసం ఈ జీవో తెస్తున్నామని చెప్పింది. ప్రజా ప్రయోజనం కోసం భూమి సమకూర్చే సంస్థకు భూయజమాని స్వచ్ఛందంగా తన భూమిని అమ్ముతున్నారని చెప్పే ఒప్పంద పత్రాలను తయారుచేసింది. ఈ భూమి సమకూర్చడం కేవలం ఒక ఒప్పందపత్రం ఆధారంగా జరుగుతుందని, కలెక్టర్ అధ్యక్షుడుగా ఉండే కమిటీ (అందులో అందరూ ప్రభుత్వాధికారులే) నిర్ణయించిన నష్టపరిహారం తీసుకుని భూయజమాని తొలగిపోవాలని, మరే హక్కులూ అధికారాలూ కోరగూడదని ఈ జీవో చెప్పింది.

ఈ జీవో దానికదే దారుణమైన, మోసపూరితమైన జీవో కాగా దానిలోని ఒక మాటకు సవరణగా అక్టోబర్ 7న జీవో 190, మరొక మాటను తొలగిస్తూ నవంబర్ 28న జీవో 214 తెచ్చారు. ఈ రెండు సవరణలూ చూస్తే ప్రభుత్వం ఎంత దుర్మార్గమైన, ప్రజావ్యతిరేకమైన ఆలోచనలతో ఉన్నదో తేటతెల్లమవుతుంది. మొదటి సవరణ ప్రకారం, నష్ట పరిహారం మీద అభ్యంతరాలు చెప్పడానికి అంతకుముందున్న 15 రోజుల వ్యవధిని 7 రోజులకు తగ్గించారు. మరోమాటల్లో చెప్పాలంటే అభ్యంతరాలు చెప్పడానికి, ఎక్కువ నష్టపరిహారం కోరడానికి, ఆలోచించుకోవడానికి, నిపుణులను సంప్రదించడానికి బాధిత ప్రజలకు అవకాశం తగ్గించారు. ఇక, “భూమి ఇవ్వడానికి సిద్ధపడిన భూయజమానుల, ఇతరుల పునరావాసానికి, పునఃస్థిరీకరణకు అవసరమైన ఖర్చులకు సమానమైన మొత్తం” కూడ నష్టపరిహారంలో ఉంటుందని మొదట జీవో 123 లో రాసిన మాటను, జీవో 214 ద్వారా కొట్టివేశారు. అంటే జీవో 123 ప్రకారం బాధితులకు పునరావాస, పునః స్థిరీకరణ ఖర్చులు ఇవ్వడం కూడ ప్రభుత్వ బాధ్యత కాదని తేల్చివేశారు.

మల్లన్న సాగర్ ముంపు బాధితుల ఆందోళన తీవ్రరూపం దాల్చిన తర్వాత, 2013 చట్టం అమలు చేయడానికి తమకు అభ్యంతరం లేదని అంటూనే, కాని జీవో

123 అమలు చేస్తే భూయజమానులకు ఎక్కువ నష్టపరిహారం అందుతుందని, 2013 చట్టం అమలు చేస్తే తక్కువ అందుతుందని అబద్ధాన్ని ప్రచారం చేయడం మొదలుపెట్టారు.

## *ఎక్కువ నష్ట పరిహారం – 2013 చట్టానికీ, జీవో 123కూ పోటీ*

“మీరు కోరుకుంటే భూసేకరణ చట్టం 2013 ప్రకారమే నష్టపరిహారం ఇస్తాం, కాని జీవో 123 కంటె తక్కువ వస్తుంది. మీ ఇష్టం. తేల్చుకోండి” అని పాలకులు మల్లన్న సాగర్ ప్రభావిత ప్రాంత ప్రజల మెడల మీద కత్తి పెట్టినట్టు మాట్లాడుతున్నారు.

అయితే సమస్య నష్టపరిహారం ఒక్కటి మాత్రమే కాదు. నష్టపరిహారం భూమి, ఆస్తి ఉన్నవారికి వస్తుంది, మరి భూమి, ఆస్తి లేని, రోజుకూలీ మీద బతికే గ్రామస్తుల సంగతేమిటి? వ్యవసాయాధార వృత్తుల మీద ఆధారపడే వారి సంగతి ఏమిటి? నష్టపరిహారం అందేవారికైనా పునరావాసం విషయం ఏమిటి? పునఃస్థిరీకరణ సంగతేమిటి? గ్రామసభ, సామాజిక ప్రభావ మదింపు నివేదిక, పర్యావరణ ప్రభావ నివేదిక, డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) వంటి ప్రజాస్వామిక, పారదర్శక, బహిరంగ పద్ధతులు లేకుండా భూసేకరణ సక్రమమేనా? చట్టబద్ధమేనా? డిపిఆర్ బైటపెట్టకుండా అసలు ప్రాజెక్టు అవసరాన్ని, ఔచిత్యాన్ని ఎవరు ఎట్లా నిర్ధారిస్తారు? ఆ ప్రాజెక్టు సాంకేతికంగా సాధ్యమయ్యేదేనా? అది తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదా? అది తక్కువ నష్టంతో ఎక్కువ ప్రయోజనం ఇచ్చే ప్రాజెక్టు అని ఎలా నిర్ణయిస్తారు? దాని లాభ నష్టాల లెక్క వేసి అది లాభకరమైనదే అని ఎవరు, ఎక్కడ తేల్చారు? అలా తేల్చి ఉంటే అది బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదు? ఈ పనులన్నీ పారదర్శకంగా, ప్రజలందరికీ, ముఖ్యంగా ఎవరి జీవితాలు భగ్నం కానున్నాయో ఆ ప్రజలకు తెలిసేట్టుగా జరుగుతున్నాయా? వంటి అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి.

పాలకులూ, వారి సమర్థకులూ మొత్తం చర్చను నష్టపరిహారానికి కుదించి, 2013 చట్టం ప్రకారం కన్న 123 జీవో ప్రకారం ఎకరానికి రు. 3,94,200 ఎక్కువ వస్తుందనే పచ్చి అబద్ధం ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి జీవో 123 లో ఎక్కువో తక్కువో కాదు, అసలు ఎంత ఇవ్వాలో మాటమాత్రంగా కూడ లేదు. జీవో 123 అనే మూడు పేజీల జీవోలో, దానికి అనుబంధంగా ఉన్న రెండు పేజీల ఫారం 1, ఒక్క పేజీ ఫారం 2 లలో ఎక్కడా నష్టపరిహారం అనే మాట లేదు. అది ఎలా లెక్కగట్టాలో ప్రాతిపదిక గాని, సూత్రం గాని లేదు.

ప్రభుత్వం భూసేకరణ జరిపినప్పుడు “నష్టపరిహారం” అనే మాట వస్తుంది. జీవో 123 అసలు ప్రభుత్వ సేకరణ అని కూడ అనడం లేదు. అందుకే “భూమి విలువ” అనే మాటను మాత్రమే వాడింది. భూయజమానులు “అభివృద్ధి ప్రక్రియలో చేరదలచి స్వచ్ఛందంగా తమ భూమిని, ఆస్తులను అమ్ముకోవడానికి వస్తున్నార”ని

సెక్షన్ 1 చెపుతుంది. ఆ అమ్మకం ఎంతకు జరుగుతుందో భూమిని సమకూర్చే శాఖకూ భూయజమానికీ మధ్య ఒప్పందం కుదురుతుందని, దాన్ని జిల్లా స్థాయి భూసమీకరణ కమిటీ ఆమోదిస్తుందని జీవో 123 చెపుతుంది.

ఆ జీవోలో రెండో సెక్షన్ ఈ సమీకరణ ఏ పద్ధతిలో జరుగుతుందో చెపుతుంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఐదుగురు ప్రభుత్వాధికారుల జిల్లా కమిటీ గురించీ, దాని ప్రక్రియ గురించీ ఈ సెక్షన్ లోని పన్నెండు సబ్ సెక్షన్లు చెపుతాయి. అప్పటికే తమ భూమిని తమ ఇష్టప్రకారం అమ్ముతున్నామని భూయజమానుల సంతకాలు చేసిన ఫారం 1ని పరిశీలించిన కమిటీ ఫారం 2 మీద సంతకం తీసుకుని ఒప్పందం చేసుకుంటుంది. ఈ ఒప్పందం అయిన తర్వాత, ఆ భూమిని ఆ యజమానులు అమ్మబోతున్నారని కలెక్టర్ పత్రికలలో ప్రకటిస్తారు. ఆ ప్రకటన మీద ఎవరికైనా అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలియజేయాలి. (ఆ తర్వాత జీవో 190 ద్వారా ఈ గడువును 7 రోజులకు తగ్గించారు). కీలకమైన సబ్ సెక్షన్ 8 "వ్యక్తిగతంగా భూయజమానికి/యజమానులకు సమీకరణ సంస్థకు జిల్లా స్థాయి భూసమీకరణ కమిటీ ముందు కుదిరిన ఒప్పందం ప్రకారం, చెల్లింపులో ఇష్టపూర్వకంగా భూమిని అమ్ముతున్న భూయజమాని భూమి, ఆస్తి విలువ, జీవనోపాధి పోయినందువల్ల జరుగుతుందని ఊహించే నష్టం, పునరావాసం, పునఃస్థిరీకరణకు అవసరమైన వ్యయానికి సమానమైన మొత్తం కలిసి ఉంటాయి" అని మాత్రమే ఉంది. మళ్లీ జీవో 214 ద్వారా ఈ సబ్ సెక్షన్ లోని చివరి భాగాన్ని (అంటే "పునరావాసం, పునఃస్థిరీకరణకు అవసరమైన వ్యయానికి సమానమైన మొత్తం" అనేదాన్ని) తొలగించారు! ఒకసారి తనకు ముట్టేదానిమీద ఒప్పందం కుదిరిన తర్వాత ఆ విలువ పెంచాలని మళ్లీ అడగబోనని భూయజమాని అఫిడవిట్ మీద సంతకం చేయాలి అని సబ్ సెక్షన్ 9 చెపుతుంది. ఈ జీవోలోగాని, ఫారం 1, ఫారం 2 లలో గాని, జీవోకు సవరణగా వచ్చిన మరి రెండు జీవోలలో గాని ఎక్కడా నష్టపరిహారం అనేమాట లేదు, మార్కెట్ విలువ అనే మాట లేదు, దానికి పదిరెట్లు అనే మాటా లేదు. ప్రభుత్వం, కలెక్టర్ లేదా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంత చెపితే అంత తీసుకుని తమ హక్కులన్నీ వదులుకొని వెళ్లిపోవడం తప్ప భూయజమానులకు మరే అవకాశాన్నీ జీవో 123 ఇవ్వలేదు.

జీవో 123కూ 2013 చట్టానికీ పోలిక పెట్టి 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం తక్కువగా వస్తుందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. జీవో 123 కన్న భిన్నంగా 2013 చట్టం చాల స్పష్టంగా "నష్టపరిహారం" గురించి చెప్పింది. అసలు నష్టపరిహారం లెక్కవేయడానికి ముందే ఆ భూసేకరణ జరిపే ప్రక్రియ ఎలా ఉండాలో నిర్దేశించింది.

మొట్టమొదట ఒక ప్రజాప్రయోజనకర పథకం కోసం భూమి సేకరించాలని ప్రభుత్వం అనుకున్నపుడు స్థానిక పంచాయతీని సంప్రదించి, పంచాయతీ సహాయంతో

ముందస్తు నోటీసు ఇచ్చి ప్రభావిత ప్రాంతంలో సామాజిక ప్రభావ మదింపు అధ్యయనం జరపాలి. ఈ అధ్యయనంలో ఆ ప్రాజెక్టు నిజంగా ప్రజాప్రయోజనాల కోసమేనా, ఎంతమంది నిర్వాసితులవుతారు, ఎంత భూమి, ఎన్ని ఇళ్లు, ఆవాసాలు మునిగిపోతాయి, సేకరిస్తున్న భూమి ప్రతిపాదిత ప్రాజెక్టుకు అవసరమైన అత్యంత కనీస విస్తీర్ణమేనా కాదా, మరొకచోట ఇంత భూసేకరణ జరగడానికి అవకాశం లేదని నిర్ధారణ జరిగిందా, మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఈ సామాజిక వ్యయం భాగం ఎంత వంటి ఎన్నో అంశాలను అధ్యయనం చేయాలని, పర్యావరణ ప్రభావ మదింపు కూడ జరపాలని చట్టంలో సెక్షన్ 4 చెపుతుంది. ఈ నివేదికల్లో వ్యక్తమయ్యే ప్రతికూల ప్రభావాలను ఎలా పరిష్కరిస్తామో చెప్పే వ్యూహాన్ని ప్రభుత్వం తయారు చేయాలని చెపుతుంది. సామాజిక ప్రభావ నివేదికనూ, తమ పరిష్కార వ్యూహాన్నీ ప్రభావిత ప్రజల ముందర బహిరంగ ప్రజా విచారణలో ప్రవేశపెట్టాలని, ఈ రెండు నివేదికలను ప్రచురించి బహిరంగ చర్చకు పెట్టాలని అంటుంది. సామాజిక ప్రభావ నివేదిక తయారీ, బహిరంగ విచారణలను ప్రభుత్వం తూతూ మంత్రంగా జరపకుండా నిరోధించడానికి సెక్షన్ 7 ప్రత్యేకంగా స్వతంత్ర బృందాన్ని ఏర్పాటు చేసి దాని ఆమోదం పొందాలని చెపుతుంది. ఆ బృందంలో ఇద్దరు ప్రభుత్వేతర సామాజిక శాస్త్రవేత్తలు, ఇద్దరు పంచాయతీ, గ్రామ సభల ప్రతినిధులు, ఇద్దరు పునరావాస విషయాల నిపుణులు, ఒక ప్రాజెక్టు సాంకేతిక నిపుణుడు ఉండాలని, అంటే ప్రభుత్వాధికారులు ఒక్కరు కూడ ఉండగూడదని చెపుతుంది. ఈ నిపుణుల బృందం గనుక ఆ ప్రాజెక్టు అవసరం లేదని నిర్ధారిస్తే ప్రభుత్వం ప్రాజెక్టు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని చెపుతుంది. అలాగే ఆహారభద్రతను పరిగణనలోకి తీసుకుని, రెండు పంటల, బహుళ పంటల భూముల్లో అసాధారణ పరిస్థితులలో తప్ప మామూలుగా భూసేకరణ జరపగూడదని చెపుతుంది.

ఇవన్నీ ఆయ్యాకనే భూసేకరణ నోటిఫికేషన్ ప్రకటించాలి. దానితోపాటే ప్రభావిత ప్రాంత ప్రజల పునరావాస, పునఃస్థిరీకరణ ప్రణాళికను ప్రకటించాలి. ఇందులో కేవలం భూమి, ఆస్తి ఉన్నవారికి నష్టపరిహారం మాత్రమే కాక, భూమిలేనివారికి, వ్యవసాయాధార వృత్తుల వారికి పునరావాస, పునఃస్థిరీకరణ ప్రణాళిక కూడ ఉండాలి. ఆ ప్రణాళికను కూడ బహిరంగంగా ప్రకటించాలి. ఆ తర్వాతనే భూసేకరణ మొదలుపెట్టాలి. ఆ దశలో మాత్రమే నష్టపరిహారం ప్రస్తావన వస్తుంది. ఆ నష్ట పరిహారం సమయంలోనే ఇప్పుడు ప్రభుత్వం తన అబద్ధాలకు పునాదిగా చెపుతున్న 'మార్కెట్ విలువ' అనే మాట వచ్చింది. రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ తగ్గించుకోవడానికి మార్కెట్ విలువ తగ్గించి చూపుతున్నారనేది బహిరంగ రహస్యమే. అందువల్ల 'మార్కెట్ విలువ' అనేది దాటడానికి వీలులేని ఆటంకం ఏమీ కాదు. 'మార్కెట్ విలువ'ను కూడ ఉన్నది ఉన్నట్టు తీసుకోనక్కరలేదు. 'మార్కెట్ విలువ'ను కలెక్టర్ ఎలా నిర్ధారించాలో 2013 చట్టం సెక్షన్ 26లో వివరంగా రాసింది.

అందులో ప్రస్తుతం అమలులో ఉన్న మార్కెట్ విలువ గురించి మాట్లాడుతూనే, భూసేకరణకు ముందు కలెక్టర్ తన విచక్షణను ఉపయోగించి అమలులో ఉన్న మార్కెట్ విలువను సవరించడానికి, నిజమైన 'మార్కెట్ రేటు'తో సమానం చేయడానికి తగిన చర్యలన్నీ తీసుకోవాలని చెప్పింది. అంటే నిర్వాసితులకు ఎక్కువ ఇవ్వాలని ప్రభుత్వానికి నిజంగా ఉంటే కలెక్టర్ చేత ఈ సవరణ చేయించవచ్చు. అలా కలెక్టర్ మార్కెట్ రేటు నిర్ధారించిన తర్వాత ఆ మార్కెట్ రేటుకు గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఎన్ని రెట్లు, పట్టణప్రాంతాల్లోనైతే ఎన్ని రెట్లు, భవనాలకు, సేకరణలో భాగమైన ఇతర స్థిరచరాస్తులకు ఎంత నష్టపరిహారం, ఎంత సొలేషియం ఇవ్వాలో కూడ 2013 చట్టం వివరంగా చెప్పింది.

ఇవన్నీ కాక పునరావాసం ఎలా కల్పించాలో, పునఃస్థిరీకరణకు ప్రభుత్వం ఎలా దోహదం చేయాలో వివరంగా కనీసం 40 సెక్షన్లలో వివరించింది. భూమికి భూమి, ఊరికి ఊరు కల్పించి, ఆ కొత్త గ్రామంలో 25 రకాల అత్యవసరమైన వసతులు కల్పించడం ఎలా ప్రభుత్వ బాధ్యతో 2013 చట్టం చెప్పింది. "ప్రజాప్రయోజనం కోసం" అనే పేరుతో తమ భూమి నుంచీ, ఉపాధి నుంచీ, గ్రామం నుంచీ నిర్వాసితులైనవాళ్లు మళ్లీ తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఎలా సహాయపడాలో ఎన్నో నిర్దేశక సూత్రాలు చెప్పింది. ప్రజలకు అబద్ధాలు చెప్పి, తప్పుడు సమాచారం ఇచ్చి భూసేకరణ జరిపితే, అందుకు బాధ్యులైన అధికారులకు ఎటువంటి శిక్షలు విధించాలో కూడ 2013 చట్టం చెప్పింది.

ఇంతకూ చాల సందర్భాలలో "ప్రజాప్రయోజనం" అని ప్రభుత్వం చెప్పేది అబద్ధం కావచ్చు. లేదా అర్ధసత్యం కావచ్చు. పాలకులు తమ ఆశ్రితులకు భూమి కట్టబెట్టడానికి ఆ అందమైన ముసుగు తొడుగుతూ ఉండవచ్చు. దేశవ్యాప్తంగానూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ అలా "ప్రజాప్రయోజనం" పేరు మీద వచ్చిన మోసకారి పథకాలు ఎన్నో ఉన్నాయని ఎందరో స్వతంత్ర పరిశోధకులు గణాంకాలతో రుజువు చేశారు. అందువల్ల ప్రజాప్రయోజనం అనే మాటనే అనుమానించాలనీ, 2013 చట్టం ఎంత ప్రగతిశీలంగా కనిపించినా అది కూడ ఈ అనుమానాస్పద "ప్రజా ప్రయోజనం" మాట వెనుక దాక్కునేదేననీ వాదించేవారు కూడ ఉన్నారు. కాని జీవో 123 అంతకన్న ఘోరమైనది గనుక కనీసం 2013 చట్టమైనా పాటించండి అని అడగక తప్పని స్థితి వచ్చింది.

1894 చట్టం నాటినుంచీ ప్రభుత్వాల దృష్టి నష్టపరిహారం మీద మాత్రమే, అంటే ఆస్తి ఉన్నవారి మీద మాత్రమే ఉన్నదని, ఆ అవగాహనను పునర్నిర్వచించి బాధిత ప్రజలందరికీ నష్టపరిహారంతో పాటు, పునరావాస కల్పన, పునఃస్థిరీకరణ బాధ్యతలను కూడ తీసుకోవాలని 2013 చట్టం ప్రవేశికలో రాశారు. ఆ ప్రగతిశీల అంశాన్ని తిరగదోడి, మళ్లీ ఒకసారి పాత బ్రిటిష్ చట్టం ప్రాతిపదికకు, నష్టపరిహార ప్రాతిపదికకు

తిరోగమించడం తెలంగాణ ప్రభుత్వ ఘనత. 1956 నుంచి 2014 దాకా, శ్రీకృష్ణ కమిషన్ ముందు కూడ తప్పుడులెక్కలతో, అబద్ధపు గణాంకాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను ఎలా మోసం చేసిందో సరిగ్గా అలాగే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కూడ అబద్ధాలతో, తప్పుడు గణాంకాలతో, అవసరమైన గణాంకాలను దాచిపెడుతూ మల్లన్న సాగర్ నిర్మాణానికి ముందడుగు వేస్తున్నది.

## *ప్రాంతపు ప్రత్యేకతలు – ప్రజల స్పందన*

నిజానికి ఈ ప్రాంతానికి ఇంత భారీ జలాశ్రయం అవసరమే లేదు. ప్రతి గ్రామంలోనూ చెరువులూ కుంటలూ ఉన్నాయి. సరిగ్గా ప్రతిపాదిత ప్రాంతం మధ్య నుంచి కూడవెల్లి వాగు ప్రవహిస్తుంది. ఆ వాగు మీద చెక్ డాములున్నాయి. వాగులో అక్కడక్కడ తీసిన గుంటల్లో జూన్ మొదటివారంలో, మండుటెండల్లో కూడ పుష్కలంగా నీళ్లున్నాయి. ఆ గుంటల నుంచి పంపుసెట్లతో నీరు తీసుకుంటూ ఆ ప్రాంతమంతటా ఉన్న సారవంతమైన భూముల్లో ఎండకాలంలో కూడ పంటలు, కూరగాయలు పండిస్తున్నారు. అన్ని గ్రామాలలో వరి, పత్తి, మక్కజొన్న ప్రధాన పంటలు కాగా కూరగాయల వ్యవసాయం కూడ ఎక్కువగానే ఉంది. ఒక్క ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామం నుంచే హైదరాబాదు రైతు బజారుకు రోజుకు రెండు బస్సుల కూరగాయలు వెళ్తాయని గ్రామస్తులు చెప్పారు. నిజానికి తెలంగాణలో గ్రామస్తులలో అత్యధికులు వలసలు వెళ్లి, బీడు పడినట్టుగా, నిర్జనంగా కనిపించే చాల గ్రామాలతో పోలిస్తే ఈ గ్రామాలు భిన్నంగా నిండా జనంతో, పనిపాటలతో, పంటలతో పచ్చగా కనిపించాయి. అలా కళకళలాడుతున్న గ్రామాలను మల్లన్న సాగర్ గర్భంలో ముంచివేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. అందుకే ప్రభావిత గ్రామాల ప్రజలందరూ ముక్తకంఠంతో “మాకు అసలు ఈ ప్రాజెక్టే వద్దు, నష్టపరిహారం ఎక్కువా తక్కువా అనే ప్రశ్న కాదు, మేం మునిగిపోవడానికి సిద్ధంగా లేం” అని అంటున్నారు. ఈ గ్రామాల్లో ఎన్నో చోట్ల రైతులు ప్రభుత్వం ఇవ్వజూపుతున్న నష్టపరిహారానికి సమానమైన మొత్తాన్ని మూడు సంవత్సరాలలో తమ వ్యవసాయ ఆదాయంతో సంపాదించగలం అని ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. అంటే వారి మూడు సంవత్సరాల ఫలసాయాన్ని మాత్రం వారి చేతుల్లో పెట్టి వారిని శాశ్వతంగా భూమి నుంచీ, ఉపాధి నుంచీ, భవిష్యత్తు నుంచీ దూరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నమాట.

అసలు ఈ ప్రాజెక్టు గురించి ఎప్పుడు ఎట్లా తెలిసిందని అడిగినప్పుడు ఏటిగడ్డ కిష్టాపూర్ వాసులు చెప్పిన విషయాలుగ్భ్రాంతి కలిగించాయి. చట్టబద్ధమైన, బహిరంగ, పారదర్శక పద్ధతులలో ఈ సమాచారం వారికి అందలేదు. గ్రామంలో ప్రకటన జరగలేదు. గ్రామసభ జరగలేదు. కనీసం నాయకులు, అధికారులు గ్రామానికి వచ్చి ప్రజలను



*ఎండాకాలంలో కూడా పంట పొలాలకు నీళ్ళందించే కోమటి చెరువు, వేములగట్టు*

సమావేశపరచి చెప్పలేదు. నీటిపారుదల శాఖ మంత్రి ఆ గ్రామం నుంచి కొంతమందిని తన దగ్గరికి పిలుచుకుని ఈ సమాచారం చెప్పారని, ఆ తర్వాతనే పత్రికలలో వార్తలు రావడం మొదలయిందని, అప్పుడు అధికారులు సర్వే పేరు మీద వచ్చారని గ్రామస్తులు అన్నారు.

కొద్దిమంది అధికారపార్టీ నాయకులు, వారి అనుయాయులు మినహా పద్నాలుగు గ్రామాల ప్రజలందరూ ముక్తకంఠంతో ప్రాజెక్టు నిర్మాణాన్ని నిరసిస్తున్నారు. తమ నిరసనలను పట్టించుకుని తమకు జవాబు చెప్పడానికి అధికారపార్టీ నాయకులు గాని, అధికారులు గాని రావడం లేదని ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఒకేఒక్కసారి కలెక్టర్, రెవెన్యూ అధికారులతో, పోలీసు అధికారులతో గ్రామానికి రాగా, గ్రామస్తులు "మమ్మల్ని ముంచకండి సారూ" అని కలెక్టర్ కాళ్ల మీద పడ్డారు. ప్రభుత్వ అధికారులకు పబ్లిక్ సర్వెంట్స్ (ప్రజాసేవకులు) అని మరొకపేరు. కాని ప్రజలే సేవకులుగా మారి తమ గోడు వెళ్లబోసుకుంటూ జిల్లా అధికారి కాళ్ల మీద పడేలా పాలన మారిపోయిందన్న మాట.

"మా భూమి మాకుండాలె. మా ఊరు మాకుండాలె. కష్టం జేసి బతికెటోళ్లం, ఎన్ని పైసలిచ్చినా పైసలేం జేస్కుంటం? మా ఊళ్లె నీళ్లు పైపైనే పడ్తయి. గల్లి గల్లికి బోరేసుకున్నం. తాగటానికి నీళ్లున్నయి. పంటలకు నీళ్లున్నయి. ఎండకాలంల గుడ పంటలు తీస్తం. ఊళ్ల చెరువున్నది, ఊరి చుట్టు మూడు చెరువులున్నయి. పదిహేను కుంటలున్నయి. ఊరి పక్కనుంచే కూడెల్లి వాగు పారుతది. రెండు చెక్ డ్యాంలున్నయి. కూడెల్లి వాగు మీద ఊళ్లెనే నాలుగైదు వందల మోటర్లతో నీళ్లు తీస్తం. మొత్తం వాగు

మీద ఈ ఎండకాలంల గుడ రెండు వేల మోటర్లు ఆడుతున్నయి. వానకాలంలో అయితే ఐదు వేల మోటర్లుంటయి” అని ఏటిగడ్డ కిష్టాపూర్ రైతులు, యువకులు చెప్పారు.

రెండున్నరవేల ఎకరాల ఏటిగడ్డ కిష్టాపూర్ లో దాదాపు 500 ఎకరాలు ఇనాం లేదా అసైన్డ్ భూములున్నాయి. అవి వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారు. ఊళ్లోని 500 కుటుంబాలలో దాదాపు నలభై కుటుంబాలను అలా బెదిరించి, వారితో ఫారం 1 మీద సంతకాలు తీసుకున్నారు. మాజీ సర్పంచ్ కమిషన్ తీసుకుని భూమి అమ్మిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాడని చాల మంది ప్రజలు అన్నారు. అలా పోగేసిన భూమి రిజిస్ట్రేషన్లు మొదట తొగుటలో జరిపారని, కాని ప్రజలు నిరసన తెల్పడం వల్ల ఇప్పుడు సిద్ధిపేటకు మార్చారని అన్నారు. మంచి పనే అనే ధైర్యం ఉంటే గ్రామంలోనే ఈ క్రయవిక్రయ లావాదేవీలు జరిపి, రిజిస్ట్రేషన్లు చేయాలని అన్నారు.

ప్రభావిత ప్రాంతం అంతటిలోకీ పెద్ద గ్రామం వేములగట్టు. ఐదువేల ఎకరాల ఈ గ్రామంలో దాదాపు మూడువేల ఎకరాలు సాగులో ఉంది. రెండువేల ఎకరాలు అడవి. గ్రామానికి పైవైపు చెరువు, కిందివైపు వాగు మధ్యలో ఊరు ఉండడంతో వ్యవసాయం, కులవృత్తులు మెరుగైన పరిస్థితిలో ఉన్నాయి. నీళ్ల సమస్యే లేదు.

పాత ప్రణాళిక ప్రకారం తడ్కపల్లి చెరువు 1.5 టిఎంసిల జలాశయంగా మారవలసి ఉండగా అది నీటిపారుదల శాఖ మంత్రి అత్తగారి ఊరు కావడం వల్ల అక్కడ ముంపు ఎత్తగొట్టడానికే, ప్రాజెక్టు స్థలాన్ని ఏటిగడ్డ కిష్టాపూర్ – వేములగట్టు ప్రాంతానికి మార్చారని వేములగట్టులో ఒక రైతు అన్నారు. మల్లన్న సాగర్ కు ఒకవైపు ముఖ్యమంత్రి ఫార్మ్ హౌజ్, పొలాలు, మరొకవైపు ముఖ్యమంత్రి కొడుకు నియోజకవర్గం, ఇంకొకవైపు ముఖ్యమంత్రి అల్లుడి నియోజకవర్గం ఉన్నాయని, వారికి సొంతగానూ, బేనామీగానూ భూములున్నాయని, వారి ఆశ్రితులకు భూములున్నాయని ప్రజలు అన్నారు. ఆ భూములకు నీరు అందించడానికి, లేదా ఆ భూములను పరిశ్రమలకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి, ఆ పరిశ్రమలకు నీరు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టు తలపెట్టారని ప్రజలు ఊహిస్తున్నారు.

ప్రభావిత ప్రాంతంలోని అన్ని గ్రామాల పంచాయతీలు తమ గ్రామాలను ముంచవద్దని, తమకు మల్లన్న సాగర్ నిర్మాణం అవసరం లేదని తీర్మానాలు చేసి పంపించాయి. ఉదాహరణకు వేములగట్టు గ్రామ పంచాయతీ తీర్మానం ఇలా ఉంది: “1.5.16 రోజున ఉదయం 11 గంటలకు శ్రీమతి కలకుంట్ల మంజుల, సర్పంచ్ గారి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమై ఈ దిగువ చూపిన అంశములపై ఆమోదించి, చర్చించి, ఏకగ్రీవముగా తీర్మానించనైనది: 1. మా గ్రామములో కొమురవెల్లి మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మించేందుకు, మా గ్రామం ముంపుకు గురి అవుచున్నదని, పత్రికలు, అధికారుల ద్వారా మాకు తెలిసినది. కాని మా గ్రామంలో

ముంపుకు గురి అవుచున్న భూములు అనేక పంటలు పండేవి. మరియు సమాజ జీవనానికి ఉపయోగపడే సహజవనరులు పుష్కలంగా ఉన్నవి. మా గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాలకు నీరందించే చెరువులు, కుంటలు ఉండి సాగునీటికి, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదు. కావున ఇట్టి ప్రాజెక్ట్ నుంచి మా గ్రామాన్ని మినహాయించే విధంగా తగుచర్యలు తీసుకొని మాకు న్యాయం చేయగలరని కోరుతూ, సభ్యులు, గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించనైనది." ఈ తీర్మానం మీద గ్రామంలోని పది మంది వార్డు సభ్యులు, సర్పంచ్ సంతకాలు చేసి పంపారు. అన్ని గ్రామాల్లోనూ ప్రజలు జరుపుతున్న నిరాహారదీక్షా శిబిరాల్లో, వేములగట్టులో జరిగిన అన్ని గ్రామాల నాయకుల సభలో మార్మోగిన నినాదం "మల్లన్నసాగర్ వద్దురా, మా ఊరే ముద్దురా" అని.

ఈ ప్రజా ఆందోళన మీద ప్రభుత్వం మొదటినుంచీ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ఒక విస్తృత ప్రజా ఆందోళనకు నాయకత్వం వహించి, ఆ ప్రజా ఆందోళన పునాదిగానే రాష్ట్రం ఏర్పరచుకుని, అధికారానికి కూడ వచ్చిన పార్టీ ఈ ప్రజా ఆందోళన పట్ల పాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన వైఖరినే అనుసరించింది. అన్ని గ్రామాల మీద, మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రజల మీద విపరీతమైన పోలీసు నిర్బంధం ప్రయోగించారు. ఏటిగడ్డ కిష్టాపూర్ నిరాహార దీక్షా శిబిరం దగ్గర సభ పెట్టుకుంటే విపరీతంగా పోలీసులను మోహరించారు. లాఠీచార్జి చేసి గ్రామస్తులను కొట్టారు. గ్రామంలో బి ఎస్ ఎఫ్ (బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ – సరిహద్దు భద్రతా దళం) క్యాంపు పెట్టి, వారితో గ్రామ వీధుల్లో కవాతులు చేయించి భయభీతావహం సృష్టించడానికి ప్రయత్నించారు. 'ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించండి' అని గిరాయిపల్లి దళం పేరుతో మావోయిస్టులు గ్రామంలో పోస్టర్లు వేశారని ప్రచారం చేసి నిర్బంధాన్ని పెంచారు. నిజానికి గ్రామంలో కనబడిన ఒకటో రెండో పోస్టర్లు కూడ మావోయిస్టులు వేసినవి కాకపోవచ్చునని, నిర్బంధానికి సాకు కోసం పోలీసులు చేసిన అబద్ధ ప్రచారం కావచ్చునని కొందరు గ్రామస్తులు అన్నారు. ఈ పోస్టర్లు పడ్డాయనే పేరుతో నాయిని స్వామి, నూనె నరసింహులు అనే ఇద్దరు యువజనులను, వారికి గతంలో ఎప్పుడో మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో పోలీసులు పట్టుకుపోయారు. తొగుట పోలీసు స్టేషన్ లో ఐదు రోజులు అక్రమ నిర్బంధంలో ఉంచి, తీవ్రమైన చిత్ర హింసలు పెట్టారు. చివరికి 124 ఎ (రాజద్రోహం) కేసు పెట్టి సిద్దిపేట సబ్ జైల్లో రెండువారాలు ఉంచారు. ఇంతకూ నర్సింహులు పోస్టర్లు రాయగలిగినంత చదువు వచ్చినవాడు కాదు. వారితో పోలీసు స్టేషన్ లో 'మీ రాత ఎలా ఉంటుందో చూద్దాం, మీరు రాశారో లేదో తెలుస్తుంది' అని కొన్ని పోస్టర్లు కూడ రాయించారు. ఒకవైపు వారు పోలీసు స్టేషన్‌లో ఉండగానే గ్రామంలో మరి కొన్ని పోస్టర్లు పడ్డాయని అంటూ, గ్రామంలో గతంలో విప్లవ రాజకీయాలతో సంబంధం ఉన్నవారందరినీ పోలీసులు బెదిరించారు. ఇదంతా కేవలం

ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజల ఆందోళనను అణచివేయడానికి జరిగిన ప్రయత్నం మాత్రమే.

## సాంకేతిక అంశాలు

ఈ ప్రాజెక్టు సాధ్యమేనా, ఉచితమేనా అని సాంకేతిక దృష్టితో పరిశీలించి ఇద్దరు ఇంజనీరింగ్ నిపుణులు, ఒక ఆర్థిక, నిర్వహణా శాస్త్రాల పరిశీలకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు చూస్తే అసలు ఈ ప్రాజెక్టు ప్రతిపాదన సాంకేతిక ప్రమాణాల దృష్ట్యా కూడ వాస్తవికమైనది కాదేమోనని, ప్రజలను మాయ చేసే మరొక జలయజ్ఞం కావచ్చునని అనుమానం కలుగుతుంది.

విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్, ఐక్యరాజ్యసమితి సాగునీటి వ్యవహారాల సలహాదారు టి హనుమంతరావు మాటల్లో చెప్పాలంటే, "సాంకేతికంగా చూస్తే ఇంత పెద్ద రిజర్వాయర్లు అవసరం లేదు. నీటి లభ్యత తక్కువ రోజులు ఉండి వినియోగం ఎక్కువ రోజులు ఉన్నప్పుడు మిగిలిన కాలానికి అవసరమైన నీటిని నిల్వ చేసుకునేందుకు చిన్న రిజర్వాయర్లు నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు తాగునీటికి, పారిశ్రామిక అవసరాలకు సంవత్సరమంతా నీరు కావాలి. అందుకోసం అవసరమైన ప్రదేశాల్లో చిన్న స్టోరేజీ ట్యాంకులు అవసరమవుతాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కేవలం సాగునీటి కోసమే మొత్తం 97 టిఎంసిలు నిల్వ ఉంచే రిజర్వాయర్లు ప్రతిపాదించారు. వాటిలో మల్లన్నసాగర్ 51 టిఎంసి, కొండపోచమ్మ రిజర్వాయర్ 21 టిఎంసి, బస్వాపూర్ 15 టిఎంసి, గంధమల్ల 10 టిఎంసి నిల్వ ఉంచాలనుకుంటున్నారు. జంటనగరాల మంచినీటి అవసరాల కోసం షామీర్ పేటలో ప్రతిపాదించిన రిజర్వాయర్ అవసరమే. అక్కడ 30 టిఎంసిలు నిల్వ చేసుకోవచ్చు. మిగిలిన గ్రామాల మంచినీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు మరో 10 టిఎంసి అవసరమైన ప్రదేశాల్లో చిన్న రిజర్వాయర్లలో నింపుకోవచ్చు. కాని పెద్ద రిజర్వాయర్ల అవసరం లేదు."

"అలాగే, కాలువల మీద, కాలువల ద్వారా రిజర్వాయర్లు నిర్మించిన విధానం దేశంలోగాని, విదేశాల్లో గాని ఎక్కడా లేదు. దేశంలోని అతిపెద్ద ప్రాజెక్టులైన భాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల కింద ఎక్కడా భారీగా నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు లేవు. ఒకప్పుడు సోవియట్ యూనియన్‌లో, ప్రస్తుతం కజకిస్థాన్‌లో ఇరితీష్ నదిపై నిర్మించిన కరగండ ప్రాజెక్టు ద్వారా 22 దశల్లో నీటిని తరలిస్తారు. 478 కిలోమీటర్ల దూరం 475 మీటర్ల ఎత్తుకు ఈ ప్రాజెక్టు నీటిని అందిస్తున్నారు. పారిశ్రామిక అవసరాలతో పాటు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు కింద కూడా ఎక్కడా రిజర్వాయర్లు లేవు. మన దేశంలో హర్యానాలో జమునా నదిపై నిర్మించిన జవహర్‌లాల్ నెహ్రూ ఎత్తిపోతల పథకంలో కూడా రిజర్వాయర్లు లేవు."



ఏటిగడ్డ కిష్టాపూర్‌లో మల్లన్న సాగర్‌కు భూమి ఇచ్చినవారికి శిక్షగా మొక్కలు పీకేస్తున్న మహిళలు

"గోదావరి జలాలను తెలంగాణ వ్యవసాయానికీ, తాగునీటికీ, పారిశ్రామిక అవసరాలకూ వాడుకోవడానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఎన్నో ఉన్నాయి."

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్, డీన్, ప్రస్తుతం స్వగ్రామ సేవా సమితి అనే గాంధేయ సంస్థ నడుపుతున్న ప్రొ. ఆర్ రమేశ్ రెడ్డి మాటల్లో చెప్పాలంటే, "భూయజమానులకు నష్టపరిహారం రావచ్చుగాని, నిర్వాసితులయ్యే ఇతర వృత్తులవాళ్లెందరో బిచ్చగాళ్లుగా మారుతారు. యాభై టిఎంసిల ప్రాజెక్టు ప్రతిపాదన అనుచితమైనది. రానున్న బహుళ జాతి సంస్థలకు బేనామీ పేర్లతో ఎక్కువ ధరలకు అమ్ముకునే దురుద్దేశంతోనే భూసేకరణ జరుగుతున్నట్టు అనిపిస్తున్నది. మంత్రులు, టి ఆర్ ఎస్ నాయకులు, పదవీ విరమణ పొందిన ఇంజనీర్లు సమస్యను సరిగా అర్థం చేసుకోకుండా మాట్లాడుతున్నారు. భజనపరుల్లా ప్రవర్తిస్తున్నారు. తమ దురుద్దేశాలను సాధించడానికి ప్రజల మధ్య ఆందోళనలు, ఘర్షణలు సృష్టిస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి వైఖరి ప్రజా వ్యతిరేకంగా ఉంది. ఈ వైఖరి వల్ల ప్రజలలో ఉద్రిక్తతలు చెలరేగి ఘర్షణలకు దారితీస్తున్నాయి. అప్రజాస్వామికంగా, మానవతను అవమానించేలా, వ్యక్తిత్వంలోని చీకటికోణాలకు సూచికగా ఉన్న ఆయన వైఖరి తీవ్రంగా అభిశంసించ వలసినది. అన్ని వర్గాలూ తీవ్రంగా ఖండించవలసినది. డిపిఆర్ ను అధికారిక వెబ్ సైట్ మీద పెట్టి పారదర్శకంగా, బహిరంగంగా ఉండడం అవసరం. మల్లన్న సాగర్ లోనే సభ ఏర్పాటు చేసి అక్కడి ప్రజల నిరాశా నిస్పృహలను తొలగించడానికి ప్రయత్నించాలి."

ఫైనాన్స్, మార్కెటింగ్ నిపుణుడు, స్వయంగా ఒక ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నడుపుతున్న వెలపాటి శ్యాం సుందర్ రెడ్డి తన ఫేస్ బుక్ మీద ఇలా రాశారు: "మల్లన్న సాగర్ అనే

ప్రాజెక్ట్ మెదక్ జిల్లాలో కట్టేసి 50 టిఎంసి నీళ్లు తెచ్చేసి 20 లక్షల ఎకరాలు పండించేసి ఆంధ్రోళ్లకి తిక్క కుదిరిస్తాం అని ఆకుకి అందని, పోకకి చిక్కని కాకిలెక్క చెబుతూ ఉంటే చాన్నాళ్లు పట్టించుకోలేదు.... ఈ మధ్య భూసేకరణ గలభాలు చూశాక, సరే ఇది ఏమిటి అని కొంచెం స్టడీ చేయాల్సి వచ్చింది. విషయం ఏమిటి అంటే కరీంనగర్ దగ్గర నుంచి 50 టిఎంసిల నీళ్లు తెచ్చి ఏటిగడ్డ కిష్టాపూర్ అనే గ్రామంలో నింపి అక్కడ నుంచి గ్రావిటీ ద్వారా మిగిలిన ప్రదేశాలకి పంపుతారు. 50 టిఎంసి లు లిఫ్ట్ ద్వారా వస్తాయి.

కెసిఆర్ అసెంబ్లీలో ప్రెజెంటేషన్ లో మల్లన్న సాగర్ రిజర్వాయర్ అని ఒక రిజర్వాయర్ గీశారు. అది కిష్టాపూర్ సెంటర్ చేసుకుని 60 చదరపు కిలోమీటర్లు అంటే దాదాపు 15000 ఎకరాలు విస్తరించి ఉంది. దానిలో ఎన్ని నీళ్ళు పట్టవచ్చు అని లెక్క వేస్తే కేవలం 17 టిఎంసి మాత్రమే పడతాయి. సరే అని కొంచెం దాన్ని పెంచి 125 చదరపు కిలోమీటర్లు చేశా. దాదాపు 31000 ఎకరాలు. దానిలో 42 టిఎంసిల నీరు పడుతున్నది. గూగుల్ లో కేసిఆర్ గీసిన గీత, నేను దానికి పెంచిన బౌండరీ పెట్టి చూస్తే ఒక అద్భుతమయిన నిజం గోచరించింది. ఈ ప్రాజెక్ట్ నీరు ప్రప్రథమంగా వెళ్లేది ఎర్రవల్లి గ్రామానికి. ఎర్రవల్లి గ్రామంలో ముఖ్యమంత్రి ఫార్మ్ హౌస్ ఉంది అని నేను చెప్పనవసరం లేదు.

సాయంత్రం ఢిల్లీ నుంచి ఒక ఫ్రెండ్ ఏదో సెమినార్ కి వచ్చి ఆఫీస్ కి వచ్చాడు కలుద్దాం అని. రావయ్యా కూర్చో, మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ కడుతున్నా అంటే పక్కన కూర్చుని సైలెంట్ గా అబ్జర్వ్ చేశాడు. అంతా అయ్యాక దీనికి నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయి అని అడిగాడు. ఇదిగో మానేరు అని చూపించా. ఏది మౌస్ ఇయ్యి అని మెజర్ చేసుకుని 70 కిలోమీటర్లా అన్నాడు. హైట్ చూడు అని చెప్పా. వెయ్యి ఫీట్. పక పకా నవ్వాడు. ఏమిటి ఇది ఎవరన్నా ఇంజినీరింగ్ స్టూడెంట్స్ కి ప్రాజెక్ట్ వర్క్ చేసి ఇస్తున్నావా అని. కాదు, నిజం ప్రాజెక్ట్ అని చెబితే, చాలా సేపు నవ్వి, చివరికి 'ఇది అవదు' అని చెప్పి వెళ్లాడు."

## ప్రభుత్వ వాదనలు – అబద్ధాలు – అర్ధసత్యాలు

ప్రభుత్వంలోని రాజకీయ నాయకులు, అధికారులు, తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు, ప్రభుత్వ సమర్థకులు ఎన్నో తప్పుడు వాదనలతో, అబద్ధాలతో, అర్ధ సత్యాలతో, ప్రశ్నలతో, సవాళ్లతో మసిపూసి మారేడుకాయ చేస్తూ సరిగ్గా గత ఆంధ్రప్రదేశ్ పాలకుల లాగ ఈ తప్పుడు ప్రాజెక్టు పేరుతో మొదట భూమి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు రాదని, వచ్చినా చెప్పిన సామర్థ్యం మేరకు, ప్రకటిత లక్ష్యాల సాధన కొరకు రాదని ఏ పదేళ్లకో, పదిహేనేళ్లకో జల యజ్ఞం లాగ బైట పడుతుంది గాని, ఈ

లోగా ఈ తప్పుడు వాదనల వల్ల ఆ ప్రాంతంలోని మూడు వేల కుటుంబాలు తమ భూమిని, భుక్తిని, భవిష్యత్తును వదులుకొని చెట్టుకొకరు పుట్టకొకరుగా మారి బిచ్చమెత్తుకుని బతకవలసిన స్థితి వస్తుంది. అందువల్ల ఆ వాదనలను, అబద్ధాలను, అర్ధసత్యాలను పరిశీలించవలసి ఉంది.

## ఎత్తున ఉన్న స్థలం

ప్రభుత్వం చెపుతున్న, సమర్థకులు ప్రచారం చేస్తున్న ఒక అబద్ధం మల్లన్న సాగర్ ప్రతిపాదిత స్థలం తెలంగాణలో ఎత్తయినదని, అక్కడ నీరు నిలువ చేస్తే అది సులభంగా కిందికి ప్రవహించడానికి వీలవుతుందని. తెలంగాణ రెండు కోట్ల ఎనభై లక్షల ఎకరాల విశాలమైన భూమి. ఇందులో సముద్ర మట్టానికి 300 అడుగుల ఎత్తు నుంచి 2000 అడుగుల ఎత్తు దాకా ఉన్న అనేక ప్రాంతాలున్నాయి. ఇవి కూడ ఒక దిశ నుంచి మరొక దిశకు ఏటవాలుగా కాక అక్కడక్కడే ఎత్తు ఒంపులుగా ఉన్నాయి. ఒక జిల్లాలోనే వ్యత్యాసాలున్నాయి. పది పన్నెండు కిమీ పరిధిలోనే రెండు వందల అడుగుల తేడా కూడ ఉంది. అందువల్లనే తెలంగాణ ప్రాంతానికి ఎక్కడికక్కడ గొలుసుకట్టు చెరువులు, చిన్నతరహా జలాశయాలు ఉపయోగపడినంతగా భారీ జలాశయాలు ఉపయోగపడవు (కాని భారీ ప్రాజెక్టులలో ఉన్న భారీ నిధులు, వాటిలో భారీ ముడుపులు, చిన్న తరహా పనుల్లో సాధ్యం కావు, సాధ్యమైనా వందలాది, వేలాది చిన్న కాంట్రాక్టర్లతో వ్యవహారం నడపడం కన్న ఒకరిద్దరు కాంట్రాక్టర్లతో సింగిల్ విండో వ్యవహారం నడపడం సులభం!). ఎత్తుగా ఉండడమే ఏ ప్రాంతానికీ జలాశయం నిర్మించే అవకాశాన్ని ఇవ్వదు. ఆ ఎత్తు ప్రాంతం పక్కనే అంతకన్న ఎక్కువ ఉన్న ప్రాంతాలూ ఉండవచ్చు. అక్కడి నుంచి కిందికి ప్రవాహాన్ని సులభతరం చేయగల ఒంపూ ఉండవచ్చు. ఒక ప్రాంతం ఎత్తుగా ఉందా లేదా అనేదాన్ని బట్టి మాత్రమే జలాశయ నిర్మాణ స్థలాన్ని నిర్ధారించడం సాధ్యం కాదు. తెలంగాణ నేల ఎత్తు వంపుల, సముద్రమట్టానికి ఎత్తుల వివరాలు తెలుసుకోదలచుకున్నవారు ఈ పటం చూడవచ్చు: http://en-in.topographic-map.com/places/Telangana-9243293/

## అభివృద్ధి – త్యాగం

'ప్రాజెక్టులు కట్టకుండా అభివృద్ధి ఎలా జరుగుతుంది', 'ఊళ్లు మునిగిపోకుండా ప్రాజెక్టులు ఎలా కడతారు', 'అభివృద్ధి కోసం త్యాగం తప్పదు', 'నాలుగు వేల ఊళ్లు బాగుపడాలంటే నాలుగు ఊళ్లు మునగక తప్పదు' అని అధికారపక్షం వేరువేరు వాదనలు తెస్తున్నది. 'మరి అభివృద్ధి వద్దా' అని విమర్శకులనూ, ఆందోళనకారులనూ నిలదీస్తున్నది. 'అయితే మీరు అభివృద్ధికి వ్యతిరేకమా' అని బ్లాక్ మెయిల్ చేస్తున్నది. 'మన ప్రాజెక్టులు

మనం కట్టుకుంటే లేనిపోని వివాదాలు సృష్టిస్తున్నారు' అంటూ ప్రశ్నించేవారు తెలంగాణ వ్యతిరేకులన్నట్టు, తెలంగాణ భావోద్వేగాలు వాడుకొని తెలంగాణ సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నది.

నిజానికి ఈ వాదనలన్నీ తెలంగాణ ఉద్యమ కాలంలో ఆంధ్ర పాలకులు చేసిన వాదనల్లాంటివే. ప్రజానుకూల అభివృద్ధి నమూనా గురించీ, ప్రజల హక్కుల గురించీ, పర్యావరణ పరిరక్షణ గురించీ మాట్లాడినవారందరికీ పాలకవర్గాలు ఈ ప్రశ్నలే వేశాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇవి పాలకవర్గాల, దోపిడీవర్గాల, స్వార్థపరవర్గాల వాదనలు. సుందర్ లాల్ బహుగుణ, మేధా పాట్కర్ ల నుంచి అరుంధతీ రాయ్ దాకా ఎందరో ప్రజా ఉద్యమకారులు, ప్రజానుకూల ఆలోచనాపరులు ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న ప్రశ్నలే ఇవి. ఈ ప్రశ్నలన్నిటికీ కూడ జవాబులున్నాయి. ఆ జవాబులు చెప్పలేకనో, అరకొరగా చెప్పగలగడం వల్లనో కొందరు ఈ బ్లాక్ మెయిల్ కు భయపడి 'మేం అభివృద్ధికి వ్యతిరేకం కాదు', 'ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు' అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. 'న్యాయమైన నష్టపరిహారం ఇవ్వమని మాత్రమే అడుగుతున్నాం' అని ప్రాధేయపడుతున్నట్టు మాట్లాడుతున్నారు. నష్టపరిహారం న్యాయబద్ధమైనదా కాదా అనేది ప్రశ్నే కాదు. దానికంటే ముందు అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి.

మీరు చెపుతున్నదంతా అభివృద్ధేనా అని అడగాలి. అభివృద్ధి అంటే ఏమిటి అని అడగాలి. ఒక ప్రాంతంలో ఒక అభివృద్ధి పథకం అమలు చేస్తే ఆ ప్రాంత ప్రజలందరికి అభివృద్ధి ఫలాలు అందినట్టేనా అని అడగాలి. ఎవరి అభివృద్ధికి ఎవరు త్యాగం చేయాలి అని అడగాలి. గత ఏడు దశాబ్దాల పాలనలో ఇదే అభివృద్ధి మంత్ర జపం జరుగుతున్నప్పటికీ అభివృద్ధి అందిన వారికే అందుతూ, త్యాగం చేసినవారే మళ్లీ మళ్లీ త్యాగం ఎందుకు చేస్తున్నారు అని అడగాలి. దేశవ్యాప్తంగా ఇప్పటికి అభివృద్ధి పథకాల పేరుమీద అమలైన అన్ని ప్రాజెక్టులూ కలిసి ఐదు కోట్ల మందిని నిర్వాసితులను చేస్తే, ఆ త్యాగం ఎవరికి భోగంగా మారింది అని అడగాలి. ఆ ఐదు కోట్ల మందికి ఏమి దక్కింది అని అడగాలి. జనాభాలో ఏడు శాతంగా ఉన్న ఆదివాసులు నిర్వాసితులలో మాత్రం ముప్పై శాతంగా ఉండడం ఎవరి అభివృద్ధి కోసం అని అడగాలి. అవన్నీ పాత పాలకుల కథలు, మేం ప్రజా ఉద్యమ పునాది మీద, ప్రాంతీయ ఆకాంక్షల సాఫల్యం కోసం వచ్చిన కొత్త పాలకులం అనదలచుకుంటే, ఆ ప్రజా ఉద్యమ పునాది, ప్రాంతీయ ఆకాంక్షలు ఎలా ఉన్నాయో జీవో 123 ఒక్కదానిలోనే రుజువవుతున్నది గదా అని అడగాలి. ఒకవైపు ఇన్నాళ్లూ విమర్శించిన కోస్తా, రాయలసీమ కాంట్రాక్టర్లకే కాంట్రాక్టులన్నీ అప్పగిస్తూ, జూన్ 2014 దాకా తెలంగాణను వ్యతిరేకించిన నాయకులను కుడి ఎడమల పెట్టుకుని ప్రాజెక్టును వ్యతిరేకించేవారు తెలంగాణ వ్యతిరేకులు అని అనడం దగుల్బాజీతనం కాదా అని అడగాలి. ఆ మౌలిక ప్రశ్నలు అడిగినప్పుడే పాలకులు



*మా ఊర్లు, మా పొలాలు మాకు వదిలెయ్యండి.*

మల్లన్నసాగర్ విషయంలో ముందుకు తెస్తున్న తప్పుడు వాదనలకు జవాబులు దొరుకుతాయి.

అభివృద్ధి కావాలి. దానికోసమే తెలంగాణ పోరాడింది. ప్రాజెక్టులు కావాలి. వాటిలో ఆరుదశాబ్దాలు అమలైన వివక్ష వల్లనే తెలంగాణ పోరాడింది. కాని అభివృద్ధికి నిర్వచనం మారాలి. పాత ఆంధ్రప్రదేశ్ లో సాగిన అభివృద్ధి నిర్వచనమే ఇవాళ కుదరదు. పాత ఆంధ్రప్రదేశ్‌లో కట్టినట్టే కాంట్రాక్టర్ల కోసం ప్రాజెక్టులు కట్టడం ఇక కుదరదు. ప్రజానుకూల అభివృద్ధి నమూనా కావాలి. ప్రజా ప్రయోజనాల కోసం ప్రాజెక్టులు కావాలి. ఒకరి భోగం కోసం మరొకరు త్యాగం చేసే అభివృద్ధి నమూనా కాదు, అతి తక్కువ త్యాగంతో, ఇష్టపూర్వకంగా త్యాగం చేసే వాతావరణంలో అందరికీ అభివృద్ధి ఫలాలు అందే అభివృద్ధి నమూనా కావాలి.

'నాలుగువేల ఊళ్లు బాగుపడాలంటే నాలుగు ఊళ్లు మునగక తప్పదు' అనే వాదన వినడానికి బాగున్నట్టు అనిపిస్తుంది. కాని ఈ వాదన ఎంత ప్రమాదకరమైనదో దాన్ని విప్పిచూస్తే అర్థమవుతుంది. అసలు నాలుగువేల ఊళ్లు బాగు పడడం లేదు. అది ఒక కాకి లెక్క. మునిగిపోయే ఊళ్లు నాలుగు కాదు. అంతకన్న చాల ఎక్కువ. అయినా మానవ జీవితం, ఉపాధి, భవిష్యత్తు వంటి విషయాలు మెజారిటీ మైనారిటీల మీద తేలేవి కావు. లక్ష ఊళ్లు కోరుకున్నా సరే ఒక్క ఊరును ముంచడానికి వీలులేదు. ప్రజాస్వామ్యమంటే మెజారిటీ మైనారిటీ మాత్రమే కాదు. మైనారిటీకి ఉండే హక్కులు ఏమిటి, ఆ నిర్ణయం వెనుక ఉండే విలువలు ఏమిటి అనేది ప్రధానం. రాజీవ్ గాంధీ 402 స్థానాలతో, మూడింట రెండు వంతుల ఆధిక్యతతో లోకసభలో ఉన్నప్పుడు, కాళోజీ ఏ సభలో మాట్లాడినా, "రాజీవ్ గాంధీకి 402 మంది బలం ఉంది గనుక, ప్రతిపక్షాలన్నీ కలిసినా 140 మందే ఉన్నారు గనుక ఏ నిర్ణయం తీసుకున్నా మెజారిటీ నిర్ణయమే అవుతుంది. వాళ్లందరూ కూచుని కాళోజీ హాజ్ టు బి కిల్డ్ అని తీర్మానం చేస్తే అది ప్రజాస్వామ్యం అవుతుందా" అని ప్రశ్నించేవారు. మైనారిటీని గౌరవించడమే, మైనారిటీ గళం వినడమే, మైనారిటీ హక్కులను పరిరక్షించడమే, మైనారిటీ కూడ

కాదు, భిన్నాభిప్రాయం ప్రకటించేవారు ఒక్కరున్నా సరే దాన్ని పరిగణనలోకి తీసుకోవడమే ప్రజాస్వామ్య మౌలిక సూత్రం అని కాళోజీ ఎప్పుడూ గుర్తు చేసేవారు.

### *నష్టపరిహారం వాదనలు*

అసలు ప్రాజెక్టు అవసరమా, సాంకేతికంగా సాధ్యమా, ప్రకటిత లక్ష్యాలు సాధించడం జరుగుతుందా, ఈ ప్రాజెక్టు ప్రజల ప్రయోజనాల కోసమేనా, కాంట్రాక్టర్ల కోసమా, మరొక జలయజ్ఞమా అనే ప్రశ్నలు చెలరేగుతుండగా, ప్రభుత్వం, దాని సమర్థకులు తెలివిగా చర్చను ఆ మౌలిక ప్రశ్నల నుంచి తప్పించడానికి మూడు లక్షలా, ఆరు లక్షలా, పది లక్షలా, ఇరవై లక్షలా అని డబ్బు చర్చగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఇది డబ్బు చర్చ కాదు. నష్టపరిహారం చర్చ కాదు. జీవితం కొల్లగొట్టి ఎంత నష్టపరిహారం ఇచ్చినా సరిపోదు. పైగా ఏటిగడ్డ కిష్టాపూర్ రైతులు అన్నట్టు ప్రభుత్వం ఇవ్వజూపుతున్న నష్టపరిహారం డబ్బు వారు మూడు సంవత్సరాల్లో సంపాదించగలరు.

భూమి, ఉపాధి, భవిష్యత్తు లాక్కుని డబ్బులు ఇస్తాం అనే వాదనకు కనీసం నాలుగు ప్రతివాదనలున్నాయి. ఆ ప్రతివాదనలకు అర్థవంతమైన జవాబులు చెప్పకుండా అభివృద్ధి మంత్ర జపం చేస్తే సరిపోదు, త్యాగం చేయాలని ఇతరులకు పిలుపులు ఇస్తే సరిపోదు.

ఒకటి, ఇది ఆస్తిపరులకు దక్కే నష్టపరిహారమే తప్ప, గ్రామంలో కనీసం మూడో వంతుగా ఉండే ఆస్తిలేనివారికి, వ్యవసాయాధార వృత్తులవారికి, నిరుపేదలకు నష్టపరిహారం దక్కదు. కనీసం 2013 చట్టంలోనైనా వారికి పరిహారం ఉంది గాని జీవో 123లో అదీ లేదు. అంటే వారు నిరాశ్రయులై కట్టుబట్టలతో పొట్ట చేత పట్టుకుని వలస బాట పట్టాలి. వారికి తెలిసిన నైపుణ్యాలు పట్నంలో పనికి రావు. కనుక ఏ పట్నంలోనో ఏ కూలీ అడ్డాలోనో నిలబడి ఎవరు తమను ఆరోజుకు కొనుక్కుంటారా అని వెతుక్కునే బానిస జీవితానికి, భిక్షాటన జీవితానికి వాళ్లను తోయడమే ఈ అభివృద్ధి ప్రాజెక్టు అంతిమ ఫలితం.

రెండు, ఎంతో కొంత భూమి, ఆస్తి ఉండి, దానికి ఎంతో కొంత నష్టపరిహారం అందేవారికైనా ఏమైనా మంచి జీవితం దొరుకుతుందా అంటే అది కూడ ఉండదు. అన్ని చోట్లా రియల్ ఎస్టేట్ బ్రోకర్ల, మాఫియాల అరాచకాల వల్ల వ్యవసాయ భూముల ధరలకు కూడ రెక్కలొచ్చి చుక్కల్లో కూచున్నాయి గనుక ఇక్కడ పది ఎకరాలకు వచ్చే నష్టపరిహారంతో మరెక్కడైనా రెండు ఎకరాలైనా కొనుక్కోగలరా అనుమానమే. అలా రెండెకరాలు కొనుక్కోగలిగినా ఆ తెలియని, కొత్త ప్రాంతంలో పునఃస్థిరీకరణకు ఎన్ని సంవత్సరాలు పడుతుంది, అన్ని సంవత్సరాలు అల్లకల్లోలమైన జీవితం ఎప్పటికి కుదుటపడుతుంది అన్నీ ప్రశ్నలే.



*హైవేను దిగ్బంధం చేస్తున్న మల్లన్న సాగర్ ముంపు గ్రామాల రైతులు*

మూడు. ఇక్కడ కూడ చిన్న, మధ్యతరగతి రైతులుగా, మధ్యకులాలకు చెందినవారిగా ఉన్నవారికి నష్టపరిహారంగా ఒక్కసారే ఎక్కువ డబ్బు చేతికి అందేసరికి అది వృథా అయిపోవడానికే ఎక్కువ అవకాశాలుంటాయి. ధనికులు, ఇతర ప్రాంతాలతో, అధికారులతో సంబంధం ఉన్నవారు, వ్యాపార దృష్టి ఉన్నవారు తమకు వచ్చిన నష్టపరిహారాన్ని జాగ్రత్తగా కుదురైన ఆదాయం వచ్చే పెట్టుబడులు పెట్టడమో, పొదుపుగా వాడుకోవడమో చేయగలరు గాని, అటువంటి సంబంధాలు లేనివారు, తరతరాలుగా పీడనకు గురైనవారు ఒక్కసారి పెద్దమొత్తం డబ్బు చూసేసరికి తక్షణ విలాసాలు తీర్చుకోవాలనుకుంటారు. ఒకవేళ వాళ్లు అనుకోకపోయినా వారిని అలా ఆకర్షించేందుకు వందలాది బహుళ జాతి సంస్థల మాయదారి సరుకులు సిద్ధంగా ఉన్నాయి. అలా నష్టపరిహారం పప్పు పుట్నాలుగా మారిపోయి అవసరం లేని వాహనాలకు, ఖరీదైన సెల్ ఫోన్లకు, ఆడంబరమైన సరుకులకు చెల్లిపోతుంది. కొన్ని సంవత్సరాల్లోనే వారు అటు స్థిరమైన భూమినీ కోల్పోయి, ఇటు ఆ భూమికి వచ్చిన నష్టపరిహారాన్నీ కోల్పోయి వీథిన పడి భిక్షగాళ్లుగా మారకతప్పదు.

నాలుగు, నష్టపరిహారం – పునరావాసం గురించి చర్చలలో ఇంతవరకూ రాని ఒక ప్రత్యేక కోణాన్ని వేములగట్టు శిబిరం దగ్గర మాట్లాడుతున్నప్పుడు ఒక రైతు వ్యక్తం చేశారు. "మనం తెలంగాణ కొట్లాడింది ఎందుకు, పరాయి ఊరోడు వచ్చి మన ఊళ్లె కబ్జా బెట్టిండని గద. ఆంధ్రోణ్ని అందుకే ఎళ్లిపోవాలన్నం గద. ఎల్లగొట్టినం గద. మరి నువ్వు ఎన్ని పైసలన్న ఇయ్యి. ఇంకో ఊళ్ల నేను భూమి కొనుక్కొని వ్యవసాయం చేస్తనే అనుకో. ఆ ఊరికి నేను పరాయోణ్ని అయితనా కానా? ఆ ఊరోళ్లు నన్ను ఎప్పటికైనా పరాయి ఊరోడు అంటరా అనరా?" అని ఆ రైతు ప్రశ్నిస్తుంటే, ఇందులో నిర్వాసితత్వం, న్యాయబద్ధమైన నష్టపరిహారం వంటి అంశాలు మాత్రమే కాక గ్రామంతో అనుబంధం, ఒక గ్రామానికి చెందినవారమనే ప్రత్యేక అస్తిత్వం, నిర్వాసితత్వంతో ఆ అస్తిత్వం

చెరిగిపోవడం, కొత్తగా తలెత్తడానికి అవకాశం ఉన్న ఘర్షణలు వంటి అంశాలు కూడ ఇమిడి ఉన్నాయని అర్థమయింది.

### "మేమూ నిర్వాసితులమే"

ఎగువ మానేరు ప్రాజెక్టు కట్టినప్పుడు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు పూర్వీకుల భూములు, గ్రామం ముంపుకు గురయిందని, ఆయన సతీమణి స్వగ్రామం మిడ్ మానేరులో ముంపుకు గురయిందని, అలా వారు కూడ నిర్వాసితులేనని, కనుక వారికి నిర్వాసితుల బాధలు తెలుసునని ప్రాజెక్టు అనుకూల వర్గాలు ఒక వాదన చేస్తున్నాయి. తాము అమలు చేస్తున్న విధానాల వల్ల బాధితులైన వాళ్ల సానుభూతి చూరగొనడానికి ఇది ఒక ప్రయత్నం. కాని ముంపు బాధితులు, నిర్వాసితులు అందరూ ఒకటే కాదు. మన సమాజంలోని అంతరాలు, నిచ్చెనమెట్ల కులవ్యవస్థ, ఆర్థిక స్థితిగతులు, అధికారవర్గంతో సంబంధ బాంధవ్యాలు నిర్వాసితత్వం మీద, పునరావాసం మీద ప్రభావం చూపుతాయి. ఒకే సమస్య అగ్రవర్ణాలుగా గుర్తింపు పొందినవారి మీద ఒకరకంగా, మధ్య కులాల వారి మీద ఒకరకంగా, దళితుల మీద మరొక రకంగా ప్రభావం వేస్తుంది. అగ్రవర్ణాలనబడేవారికి భూమి ఆస్తిగా మాత్రమే కనబడుతుంది గనుక ఇక్కడ ఆస్తి పోతే మరొక చోట వస్తుందనుకుంటారు. మధ్య కులాల వారికి భూమే జీవితం, జీవనాధారం. అది కోల్పోవడం వారికి దుర్భరమవుతుంది. దళితులకూ, భూమిలేని నిరుపేదలకూ ఉపాధికి హామీనిచ్చేది వ్యవసాయ వృత్తులే గనుక వ్యవసాయం రద్దయిపోవడం అంటే వాళ్ల జీవితం ధ్వంసం కావడమే. ఇక ఆస్తిపరులకు, సంబంధాలున్నవారికి పునరావాసం చాల సులభం. మిగిలినవారికి మరొక చోట పునరావాసానికి తగిన వనరులు లేక, సంబంధాలు కూడ లేక వారి బతుకు నీటిలోంచి బైటపడేసిన చేపల్లా అవుతుంది. మన సమాజ అంతరాలకు ప్రతిబింబంగా ఉన్న ఈ వ్యత్యాసాలను పట్టించుకోకుండా నిర్వాసితత్వం గురించి, పునరావాసం గురించి మాట్లాడడం అర్థరహితం.

### "రెచ్చగొడుతున్న ప్రతిపక్షాలు"

మల్లన్న సాగర్‌లో అసలు సమస్యే లేదనీ, ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్ల, అబద్ధాలు చెప్పడం వల్ల కొందరు ప్రజలు ఆందోళన బాట పట్టారనీ ప్రభుత్వ నాయకులూ, సమర్థకులూ అంటున్నారు, రాస్తున్నారు. వారు చెప్పేది నిజమని వారికి ఎంతమాత్రం నమ్మకం ఉన్నా ఒక్కసారి ఆ గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడాలి. ఆందోళన బాట పట్టినది ప్రతిపక్షాల దుష్ప్రభావంలో ఉన్న కొద్దిమంది మాత్రమే అని వారు అనుకుంటున్నారు గనుక, అత్యధిక సంఖ్యాకులు తమతోనే ఉన్నారని అనుకుంటున్నారు గనుక వారు గ్రామాలకు వెళ్లి ఆ కొద్ది మందిని ప్రతిపక్షాల ప్రభావం నుంచి బైటికి

తీసుకురావడం పెద్ద కష్టం కాదు. కాని ఈ ఆందోళన మొదలై నెలలు గడిచిపోతున్నా కనీసం అధికారపార్టీకి చెందిన ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు కూడ ఆ గ్రామాలవైపు వెళ్లలేదు, బైట ప్రగల్భాలు పలుకుతున్న మంత్రులూ నాయకులూ అధికారులూ వ్యాసరచయితలూ సరేసరి.

ఆ మాటకొస్తే సమస్యను తెలుసుకోవడానికి, బహుశా సమస్యను వినియోగించు కోవడానికి కూడ ప్రతిపక్షాలే ఆ గ్రామాలకు వెళ్తున్నాయి, ప్రజలతో మాట్లాడుతున్నాయి, ప్రజల గోడు వింటున్నాయి. తమకు తోచిన పరిష్కార మార్గాలు సూచిస్తున్నాయి. అయితే ఎప్పుడైనా ఎక్కడైనా ప్రతిపక్షాల పాత్ర పూర్తిగా వ్యతిరేకించ వలసినదీ కాదు, పూర్తిగా ఆమోదించదగినదీ కాదు. ఆయా సందర్భాన్ని బట్టి దాన్ని వివరంగా చర్చించి, అది సరైనదో కాదో నిర్ణయించవలసి ఉంటుంది.

ఏ ప్రజాందోళనలోనైనా ప్రతిపక్షాల పాత్ర మూడు కారణాలవల్ల ఉండవచ్చు. ఒకటి, అన్ని రాజకీయపక్షాలూ ఏదో ఒక స్థాయిలో ప్రజల మధ్య పని చేస్తుంటాయి గనుక, తమ కార్యకర్తల, శ్రేణుల, వారి ప్రభావంలో ఉన్న ప్రజల నిజమైన సమస్యలను పట్టించుకోవడం అన్ని రాజకీయ పక్షాలకూ అనివార్య కర్తవ్యం అవుతుంది. ప్రతిపక్షాలకైతే ఆ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. రెండు, ఎప్పుడైనా ప్రతిపక్షాలు తమ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి అధికారపక్షం ఎక్కడ తప్పులు చేస్తుందా అని వెతుకుతూ వాటి మీద ప్రజలను సమీకరించే బాధ్యత తీసుకుంటాయి. మూడు, అధికారపక్షం చేస్తున్న అన్యాయాన్ని ఎదిరించడానికి మరే మార్గమూ గత్యంతరమూ లేక ప్రజలు అనివార్యంగా ప్రతిపక్షాలను ఆశ్రయించినప్పుడు, ప్రతిపక్షాలకు ఆ సమస్యలోకి దిగకతప్పదు.

ఫిషింగ్ ఇన్ ట్రబుల్డ్ వాటర్స్ (కల్లోలం ఉన్ననీళ్లలో చేపలుపట్టడం) అని ఇంగ్లిష్ నుడికారం చెప్పినట్టు నీళ్లు కల్లోలంగా ఉంటే చేపలు పట్టడానికి ఎవరైనా వస్తారు. అసలు నీళ్లలో కల్లోలం ఎందుకు, ఎవరు పుట్టించారు అనేది అసలు సమస్య. అది చర్చించకుండా, చేపలు పట్టేవాళ్లను తప్పు పట్టడం వాదనకు పనికి వస్తుంది గాని సమస్య గురించీ, పరిష్కారాల గురించీ అవగాహన పెంచదు.

ఇవాళ మల్లన్న సాగర్ బాధితుల గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష పార్టీలు గతంలో అక్రమంగా భూసేకరణ జరిపినవే కావచ్చు. నష్టపరిహారం తక్కువ ఇచ్చి అన్యాయం చేసినవే కావచ్చు. నిర్వాసితుల ఆందోళనల మీద అణచివేత చర్యలు ప్రయోగించినవే కావచ్చు. అందువల్ల ఆ పార్టీలకు ఆ సమస్య మీద మాట్లాడే నైతిక అర్హత లేదని కూడ అనవచ్చు. కాని ఆ ఆరోపణలతో సమస్య మాయమైపోదు. సమస్య వేరు, దాని మీద మాట్లాడేవాళ్ల అర్హతానర్హతలు వేరు. ఆ అర్హతానర్హతల గురించి మాట్లాడడం కన్న ముందు సమస్యను అర్థం చేసుకోవడానికీ, పరిష్కరించడానికీ ప్రయత్నించాలి.

## ప్రజల మధ్య చీలిక

వస్తుందో రాదో తెలియని, కాంట్రాక్టర్ల కోసం తయారవుతున్న ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం దుర్మార్గమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నది. ప్రజల మధ్య చీలికలు తెచ్చి, విద్వేషాలు రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకోవడానికి, తన మాట చెల్లించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. గ్రామాల్లో తమ పార్టీ అభిమానులను ప్రోత్సహించి వారిచేత భూమి అమ్ముతామని సంతకాలు చేయించడానికి, గ్రామానికీ వారికీ మధ్య చీలిక తేవడానికి మొదట ప్రయత్నం చేశారు. అలా ఎంత ప్రయత్నించినా పాలకుల పన్నాగాలు సాగలేదు. ఐదు, పది శాతం కన్న ఎక్కువ మంది గ్రామస్తులు ఈ కుట్రలకు లొంగలేదు. పైగా లొంగిన వారి మీద గ్రామస్తులందరూ ఊరుమ్మడి తీర్మానాలు చేసి బహిష్కరణలు, శిక్షలు విధించారు. దానితో గ్రామస్తులలో ఏ ఒక్కరూ, అధికారపార్టీకి చెందినవారు కూడ, తమ గ్రామాలకు ద్రోహం చేయడానికి ముందుకు రాలేని పరిస్థితి వచ్చింది. అప్పుడిక ఈ ప్రాజెక్టుతో నిజామాబాద్, మెదక్, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు నీరు అందుతుందనే అబద్ధ ప్రచారంతో ఆ జిల్లాల్లో తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రతికూల ఆందోళనలు నడపడం మొదలుపెట్టారు. అన్ని ప్రాంతాల్లోనూ, హైదరాబాదులోనూ సభలు నిర్వహించారు. కాని ఈ ఆందోళనల్లో, సభలో పాల్గొన్నవారిలో రైతులు తక్కువ, పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ సమర్థకులు ఎక్కువ. పాల్గొన్నవారిలోనూ, ప్రసంగించినవారిలోనూ ఏ ఒక్కరికీ మల్లన్న సాగర్ గురించి స్పష్టమైన వాస్తవాలు తెలియవు. ఏ ఒక్కరూ ఆ వాస్తవ వివరాలు ప్రస్తావించలేదు. 50 టిఎంసిల ప్రాజెక్టు అని ఒకపక్క చెపుతూనే, ఒక 200 టిఎంసిల ప్రాజెక్టు వల్ల ఏయే వసతులు సమకూరుతాయో అవన్నీ మల్లన్న సాగర్ నుంచి వస్తాయని అబద్ధాలు చెప్పారు. తెలంగాణ భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి, అభివృద్ధి మాయాజాలంతో కళ్లు మిరుమిట్లు గొలిపేలా చేయడానికి ప్రయత్నించారు.

## ముగింపు

మరి ఈ నేపథ్యంలో మల్లన్న సాగర్ విషయంలో ఎలా ఆలోచించాలి?

ఒకరకంగా ఆలోచిస్తే ఇది చాల సులభమైన సమస్య. మొట్టమొదట సూక్ష్మస్థాయిలో ప్రభావిత ప్రజల దగ్గర ప్రారంభించాలి. నిజంగా ప్రాజెక్టు ఏమిటో, దానితో ఏ ఉపయోగాలున్నాయో, అది ఎందుకు అవసరమో, దాని కోసం ప్రభావిత ప్రజలు ఏ త్యాగాలు చేయాలో, సమాజం కోసం వారు ఆ త్యాగం చేస్తే, వారికి సమాజం ఏ ప్రతిఫలం ఇస్తుందో వివరంగా, స్పష్టంగా, నిర్దిష్టంగా చెప్పాలి. అలా సంపూర్ణ వాస్తవ సమాచారం మీద ఆధారపడి ఆ ప్రజలను ఒప్పించగలిగితేనే ప్రాజెక్టు ఆలోచనను ముందుకు తీసుకుపోవాలి. అప్పుడైనా 2013 చట్టం నిర్దేశించిన మార్గదర్శకాలన్నిటినీ

పూర్తిగా అమలు చేయాలి. గ్రామపంచాయతీలను విశ్వాసంలోకి తీసుకోవాలి. సామాజిక ప్రభావ మదింపు, పర్యావరణ ప్రభావ మదింపు, సాంకేతిక ఔచిత్యం వంటి నివేదికలన్నీ స్పష్టంగా, వివరంగా తయారు చేయించాలి. గ్రామ సభలు ఏర్పాటు చేయాలి. స్వతంత్ర, ప్రభుత్వేతర నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల గురించి, ఉచితానుచితాల గురించి నిర్ధారించాలి.

ఈ పనులన్నీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోతే అసలు ప్రాజెక్టు నిర్మాణ ఆలోచననే ఉపసంహరించుకోవాలి. ప్రభావిత గ్రామాల ప్రజా ఉద్యమం బలంగా కోరుతున్నది అదే.

నిజానికి పశ్చిమ బెంగాల్‌లో సింగూర్‌లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని సోంపేటలోనూ కొంత పని నడిచిన ప్రాజెక్టులు కూడ వాటికి వ్యతిరేకమైన ప్రజా ఉద్యమం వల్ల, ప్రజల బలమైన కోరిక వల్ల రద్దు అయ్యాయి. అటువంటి ఉదాహరణలు దేశంలోనూ ప్రపంచంలోనూ ఎన్నో ఉన్నాయి. ప్రజలు తలచుకుంటే వారిని ఆపగల శక్తి ఏదీ భూప్రపంచం మీద లేదు.

అయితే ప్రతి ప్రజా ఉద్యమమూ ఎంత బలమైన ప్రజా ఆకాంక్షల వ్యక్తీకరణ అయినా తప్పనిసరిగా గెలుస్తుందనే హామీ కూడ లేదు. ఎంతో శక్తిమంతమైన, వేలాది మంది ప్రజలు పాల్గొన్న నర్మదా బచావో ఆందోళన్ వంటివి ఓటమికి గురయ్యాయి. ప్రభుత్వాలు ప్రజలలో చీలికలు తెచ్చి, ఒకరిమీదికి ఒకరిని రెచ్చగొట్టి, కొందరిని కొనివేసి, కొందరిని బెదిరించి, దారుణమైన అణచివేత చర్యలు ప్రయోగించి ప్రజా ఉద్యమాలను బలహీనపరచి, ప్రాజెక్టులను నిర్మించే పేరు మీద ఆశ్రితులకు లాభాలు సమకూర్చిన ఉదాహరణలు కూడ చరిత్రలో ఉన్నాయి.

అసలు ప్రాజెక్టు నిర్మాణమే వద్దు అనే ఏకైక డిమాండ్‌తో నడిచే ఉద్యమం అయినా అనుకోని పరిస్థితులలో బలహీనపడితే, ప్రత్యామ్నాయంగా ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించుకోవాలి. అటువంటి సందర్భంలో 2013 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయమని కోరడం మెరుగైన ప్రత్యామ్నాయం. కేవలం నష్టపరిహారం విషయంలో మాత్రమే కాదు, ఆ చట్ట నిబంధనలన్నిటినీ ఒక్కటి కూడ పొల్లుపోకుండా పాటిస్తేనే మా భూములు వదులుతామని అంటే, పునరావాసానికీ, పునఃస్థిరీకరణకూ అవకాశం దొరుకుతుంది.

ఏది ఏమైనా మల్లన్న సాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు ఒక చరిత్రాత్మకమైన సందర్భానికి తెర తీశారు. అందుకు తెలంగాణ సమాజమంతా వారికి కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది. వారి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించవలసి ఉంది. ఇవాళ తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అన్ని జిల్లాలలోను దాదాపు ఐదు లక్షల ఎకరాల భూమిని సేకరించడానికి, పాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల లాగనే ఆశ్రితులకు పందారం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నది. ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న



*మల్లన్న సాగర్ వద్దు, మా గ్రామాలే మాకు ముద్దు. కదం తొక్కిన ముంపు గ్రామాల ప్రజలు*

నిర్వాసితత్వానికి వ్యతిరేకంగా, ప్రాజెక్టుల ఔచిత్యాన్ని పరీక్షించడానికి, అత్యవసరమైన ప్రాజెక్టులైతే న్యాయబద్ధమైన నష్టపరిహారం, పునరావాసం, పునఃస్థిరీకరణ కోరడానికి, తెలంగాణ ప్రజల స్వావలంబనను, స్వయంనిర్ణయాధికారాన్ని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి ఒక ప్రజా ఉద్యమం జరగవలసిన అవసరం ఉంది. ఆ మహా ఉద్యమానికి మల్లన్న సాగర్ ముంపు బాధిత ప్రజలు మార్గం చూపుతున్నారు.